
భలే మ్యాజిక్ : పెద్దాపురం కుమ్మరివీధిలో నీరు భూమిలో ఇంకిపోయేలా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌లో నీరు పోయించి పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

గోదారోళ్లు మనసున్నోళ్లు..

అందరి కంటే మంచి మనసున్న వ్యక్తులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్నారు. గోదావరి జిల్లా వాసుల మాట సౌమ్యంగా ఉంటుంది. ఇటువంటి ఈ జిల్లాలోనే గత పాలనలో రౌడీయిజం పెరిగిపోయింది.. హత్యలు చేసే వా రిని తూర్పుగోదావరి జిల్లాలోకి రానివ్వరు. కానీ గత వైసీపీ ఎన్నో అరాచకాలు చేసింది. అందుకే గోదావరి జిల్లాల వాళ్లు ఆ పార్టీనే దూరం పెట్టారు. కానీ ఇప్పుడు మేం వీటన్నింటిని సరిచేస్తున్నామన్నారు. పెద్దాపురంలో రూ.330 కోట్లతో చెత్త నుంచి విద్యుదుత్పత్తి తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. రెండేళ్లలో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ 18 నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించానని తెలిపారు. గోదావరి వరదలకు కోనసీమ జిల్లాలో లంక గ్రామాలు ముంపునకు గురైతే ఎప్పటికప్పుడు అందరిని అలెర్ట్ చేసి ప్రజలకు అండగా నిలిచామన్నారు. పెద్దాపురంలో రూ.38 కోట్లు, సామర్లకోటలో రూ.39కోట్ల అమృత్ నిధులతో ఇంటింటికి కుళాయి పథకాన్ని మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. రెండేళ్లల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.సామర్లకోటలో డిగ్రీ కళాశాల,పెద్దాపురంలో ప్రభుత్వాసుపత్రి ఇలా పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప ఏది అడిగినా చేస్తాం.అడిగిన దాని కంటే ఎక్కువ చేస్తానన్నారు.



మీ ప్రాజెక్ట్ సూపర్



స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన తొమ్మిది స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రీసైక్లింగ్‌లో భాగంగా చేపడుతున్న ఉత్పత్తులపై ఆరా తీశారు. డ్రైవేస్ట్, ప్లాస్టిక్ వేస్ట్, మెటల్ వేస్ట్‌గా చెత్తను వేరుచేసేలా ప్రాజెక్ట్ రూపొందించిన తొమ్మిదో తరగతి విద్యార్థులను మెచ్చుకున్నారు. సముద్రపు నాచుతో బయోడీజిల్,కాస్మెటిక్స్ వంటి ఉత్పత్తులు తయారు చేస్తున్న నిర్వాహకులతో ముచ్చటించారు. సముద్రపు నాచుతో మహిళలకు ఉపాధి కల్పించే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు సీఎం తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో సము ద్రపు నాచుతో ఉత్పత్తులపై శిక్షణ పొందిన మహిళలతో వర్చువల్‌గా మాట్లాడారు.



స్వచ్ఛ రథం.. సూపర్



జనచంద్రం : ప్రజా వేదిక సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



స్వర్ణాంధ్ర చేస్తా!

పెద్దాపురంలో సీఎం చంద్రబాబు

- స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర దిశగా అడుగులు
- బంగారు కుటుంబాలు పెరగాలి
- పారిశ్రామికవేత్తలకు పలు కుటుంబాలు దత్తత

(కాకినాడ,పెద్దాపురం,ఆంధ్రజ్యోతి)

స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర నా లక్ష్యం.. ఆ దిశగానే అడుగులు వేస్తున్నా.. పెద్ద పెద్ద ప్రారంభోత్సవాలు.. కార్యక్రమాల కోసం తాను పెద్దాపురానికి రాలేదని..ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పడానికి వచ్చానని..ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలన్నదే తన సంకల్పం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో శనివారం సీఎం పర్య టించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది.. అప్పుడే ప్రతి కుటుంబం ఆనందంగా ఉంటుందని.. దీనిలో భాగంగానే ఏడు నెలలుగా ప్రతి మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర నిర్వహిసున్నామని తెలిపారు. అపరిశుభ్రత కారణంగా అంటువ్యాధులు వస్తాయని సీఎం వివరించారు. అక్టోబర్ 2వ తేదీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా చెత్త ఉండకూడదని ఆదేశించారు. డ్రోన్లు ఉపయోగించి దోమ ల నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వ అలక్ష్యంతో అంటువ్యాధులు ప్రబలాయన్నారు. పేదవారు ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో ప్రభు త్వం ఆధ్వర్యంలో ప్రైవేటు ఆసుపత్రులను పీపీపీ పద్ధతిలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. నా లక్ష్యం స్వర్ణ ఆంధ్ర కావాలంటే భవిష్యత్తులో ఏ పార్టీ వైపు చూడకుండా ఎన్డీఏ వైపు ప్రజలంతా ఉండాలని పిలుపునిచ్చారు.

నా పేరు.. పవన్ పేరు చెప్పి బస్సెక్కండి!



టీడీపీ సూపర్‌సిక్స్ అంటే సాధ్యం కాదని చాలామంది అన్నారు.. కానీ ఇప్పుడు అమలు చేసి చూపెట్టాం. ఆగస్టు 15న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం అద్భుతంగా విజయవంతమైంది.. కాకినాడ, రాజమండ్రి వెళ్లాలంటే బస్సెక్కి తన పేరు..పవన్ పేరు చెప్పి జల్సాగా వెళ్లిపోవచ్చని సరదాగా వ్యాఖ్యానించారు. అమ్మగారింటికి వెళ్లాలన్నా, తల్లిని పలకరించేందుకు వెళ్లడానికి ఇక ఇబ్బందే లేదని చమత్కరించారు.


పట్టాభి ఆగ్రో ఇండస్ట్రీస్ ఎండీ బీవీ.కృష్ణారావుకు బంగారు కుటుంబాన్ని దత్తత ఇస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు


మీ సేవలు భేష్ : పారిశుధ్య కార్మికులకు మెమెంటోలు అందజేత


బంగారు కుటుంబాలతో మాటామంతీ..



పాత పెద్దాపురం, సామర్లకోటకు చెందిన నందిక మార్త, యండ మూరి ఏసమ్మ, రాజారపు వీరలక్ష్మి, కడగాల గౌరి, కోసి ఉదయకుమారి, పలివెల లక్ష్మి, మాల్లాడి రాజేశ్వరి, మాటం సత్యవేణి, సరుకుల శ్రీదేవి, ఇజ్జిన స్వాతి కుటుం బాలతో చంద్రబాబు ముచ్చటిం చారు.ఇబ్బందులు తెలుసుకున్నారు. వీరిని దత్తత తీసుకున్న మార్గదర్శులైన లలిత ఇండస్ట్రీస్ ఎండీ మట్టే శ్రీనివాస్,పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ఎండీ బీవీ.కృష్ణారావు, శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్‌సున్న రామకృష్ణ, కొడవడి గాంధీ, అపర్ణ టైల్స్ హెచ్ఆర్ అజయ్‌కుమార్, వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ఎండీ వల్లూరి సూర్యప్రకాశరావు,దేవి సీఫుడ్స్ బ్రహ్మానందం, బ్లూ ఓషన్ ఎండీ రవికాంత్ తదితరులను సీఎం సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

ఉదయం 11.55 గంటలకు హెలికాప్టర్ దిగిన చంద్రబాబు తొలుత పెద్దాపురం పదో వార్డులో మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించారు.ఆ తర్వాత పావు కిలోమీటరు మేర వైద్యులు, ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛతా ర్యాలీ చేశారు. అనంతరం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో కలిసి బస్సులో 1.20 గంటలకు ప్రజా వేదిక వద్దకు చేరుకున్నారు. పెద్దాపురం మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. వీరి కోసం యాక్సిస్ బ్యాంకు ద్వారా బీమా పథకాన్ని ప్రారంభించారు. పెద్దాపురం మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న వై.వీరవెంకట సత్యనారాయణ, ముత్య దుర్గను సీఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు. అలాగే యాక్సిస్ బ్యాంక్ ద్వారా ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు. సాయంత్రం 5.22 గంటలకు అమరావతికి తిరుగుపయనమయ్యారు.






పెద్దాపురంలో సీఎంతో సెల్ఫీ తీసుకుంటున్న యువతి





సమగ్ర మార్పులే లక్ష్యంగా నూతన బార్ పాలసీ : శర్మ

రాజమహేంద్రవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం నియంత్రణ, వ్యాపారంలో సమగ్ర మార్పులే లక్ష్యంగా ప్రభుత్వం నూతన బార్ పాలసీని అమ ల్లోకి తెచ్చిందని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు,ఈఎస్‌లు, సీఐలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త బార్ పాలసీ ప్రకారం లైసెన్సుల మంజూరులో ఆన్‌లైన్ విధానం అమలు చేస్తూ, ఎంపికలో పారదర్శకత పాటిస్తున్నామన్నారు.రాష్ట్రంలోని 840 బార్‌లలో గీత కార్మికులకు 10 శాతం కేటాయించామన్నారు. లైసెన్సు ఫీజులను 70 శాతం నుంచి 50 శాతానికి తగ్గించామని వాటిని ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చన్నారు. 26న సాయంత్ర 5గంటల్లోపు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, 28న కలెక్టర్ల సమక్షంలో లాటరీ నిర్వహించి 1 నుంచి కొత్త బార్‌లు అమల్లోకి తీసుకొస్తామని చెప్పారు. మూడు కంటే ఎక్కువ కేసులు ఉన్న సారా వ్యాపారులపై పీడీ చట్టం అమలు చేయాలని సూచించారు.14405 టోల్‌ఫ్రీ నెంబరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.మూడు జిల్లాల్లో 46 బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానించగా కేవలం 8 మంది ఎన్‌రోల్ చేయించుకున్నారు. సమావేశంలో డీసీ చైతన్య మురళీ,ఏసీ రేణుక, ఈఎస్‌లు, ఏఈ ఎస్‌లు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటి వద్దకే స్మార్ట్ రేషన్ కార్డులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకూ గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే పంపిస్తామని జేసీ చిన్న రాముడు తెలిపారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు సంబంధించి 5,59,203 స్మార్ట్ రేషన్ కార్డులను తహశీల్దార్ల కార్యాల యాలకు పంపించామన్నారు. పాత రేషన్ కార్డుల స్థానంలో వీటిని పంపిణీ చేయడం జరు గుతుందన్నారు. సెప్టెంబరు 1 నుంచి రేషన్ షాపుల వద్ద కూడా అందజేస్తామని చెప్పారు. ఈ కార్డులకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

యూరియా వినియోగం ఎందుకు పెరిగింది : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రైతులు అవసరానికి మించి యూరియా వినియోగించకుండా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మండలాల వారీగా యూరియా వినియోగం, సరఫరాపై వ్యవసాయాధికారులతో సమీక్షించారు.గత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 21 వేల మెట్రిక్ టన్నుల యూరియా వినియోగించగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే 26 వేల 464 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ఇండెంట్ సమర్పించారన్నారు.ఈ సీజన్‌లో 1500 ఎకరాల్లో మాత్రమే వరిసాగు పెరిగిన నేపథ్యంలో సుమారు 5 వేల టన్నుల అదనపు యూరియా అవసరం ఎందుకని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటి వరకు 18,588 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రైవేటు ఎరువుల షాపులు, రైతు సేవా కేంద్రాలు, సొసైటీల్లో 2,400 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు.అవసరానికి అనుగుణంగా సరఫరా కొనసాగిస్తామన్నారు. ఆగస్టు 25న జిల్లాకు 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా రానున్నదన్నారు.అవసరమైన మండలాలకు ప్రాధాన్యతతో కూడిన సరఫరా ఉండాలని ఆదేశించారు. కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఐరన్ మాత్రలు పంపిణీ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే 20-49 సంవత్సరాల వయసున్న ఉద్యోగినులు, సిబ్బందికి ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయం ఉద్యోగులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. వారానికోసారి ఐరన్ మాత్రలు వేసుకోవడం ద్వారా రక్తహీనత నివారించవచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులకు ఈ ఐరన్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ పి.కోమల, కొవ్వూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ మౌనిక, ఆఫీస్ సూపరింటెండెంట్ తారా కుమారి, డీపీహెచ్‌ఎన్‌వో టి.సత్యవతి పాల్గొన్నారు.

వరద బాధితుల ఆహారంలో కోత

రాజమహేంద్రవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వరద పునరావాస కేంద్రాల్లో ఉన్న మత్స్యకారులకు ఆహారంలో కోత పెట్టారు. శుక్రవారం వరకూ విందు భోజనం పెట్టి, శనివారం నుంచి సాంబారు, కూరతో సర్దుకోమన్నారు. అందులోనూ బంగాళా దుంప కూర కావడంతో చాలా మంది పెరుగుతో సరిపెట్టుకున్నారు. వరద బాధితుల పునరావాస కేంద్రంలో భోజనాల కోసం ఒక్కొక్కరికి రూ.350 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆ డబ్బులతో ఉదయం అల్పాహారం,టీ/కాఫీ/పాలు, మధ్యాహ్నం, రాత్రి, భోజనం, సాయంత్రం స్నాక్స్ సమకూర్చాల్సి ఉంది. 3 రోజుల నుంచీ శేషయ్యమెట్టకు చెందిన ప్రైవేటు కేటరింగ్ వాళ్లు వండి తీసుకొచ్చారు. అయితే గురువారం కలెక్టర్ ప్రశాంతి ఆల్‌కట్ గార్డెన్స్ సమీపంలోని నగర పాలక సంస్థ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వెళ్లగా అప్పుడు.. కూరలు ఇబ్బంది అవుతుందని మత్స్యకారులు చెప్పారు. దీంతో పునరావాస కేంద్రం వద్ద వంట చేయాలని ఆమె ఆదేశించారు.ప్రైవేటు కేటరింగ్ వాళ్లకు ఆ విషయం చెప్పగా..కుదరదనడంతో మల్లిఖా ర్జునగర్‌కి చెందిన వేరొక కేటరింగ్‌కి అప్పగించారు.దీంతో వాళ్లు శనివారం నుంచి పునరా వాస కేంద్రం వద్ద వండుతున్నారు. అయితే.. ఆహారంలో కోత విధించారు. ఉదయం టమాట బాత్, మధ్యాహ్నం,రాత్రికి సాంబారు, కూర, పె రుగుకు పరిమితం చేశారు. ప్రభుత్వం రూ.350 చెల్లిస్తున్నా ఆహారంలో కోతపై విమర్శలు వినవస్తున్నాయి.





గర్భిణులకు మంచాలు ఏర్పాటు

వరద బాధితుల పునరావాస కేంద్రంలోని గర్భిణులకు మంచాలు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి కారణంగా లంకల్లోని మత్స్యకారులను పునరావాస కేంద్రాల్లోకి తరలించారు. వీళ్లలో గ ర్భిణులు ఉన్నారు. మంచాలు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది.దీంతో అర్బన్ తహశీల్దార్ పాపారావు స్పందించి పునరావాస కేంద్రంలో మంచాలు ఏర్పాటు చేయించారు. దీంతో గర్భవతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఇంట్లో ఉంచొద్దు

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు పార్కు వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డ్రోన్ సహాయంతో కంబాల చెరువులో దోమల మందు పిచికారీ చేశారు. కంబాలచెరువులో దోమల నివారణకు గంబూషియా చేప పిల్లలు వదిలారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలో పాడైన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇంట్లో ఉంచుకోవడం లేదా విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సేకరణ కేంద్రంలో ఈ వ్యర్థాలను అందజేస్తే వాటిని సరైన రీతిలో రీసైక్లింగ్ చేసి ముప్పులేకుండా తొలగించడం జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించే ప్రతి ఒక్కరూ రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అనే మూడు విషయాలను గుర్తుంచుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని నగరంలో సమర్థవంతంగా అమలుచేసి పర్యావరణాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఒక బృహత్తరమైన కార్యక్రమం అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జిశైలజావల్లి, ఎస్ఈ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, మేనేజరు ఎండి అబ్దుల్ మాలిక్, ఈఈలు మాధవి, రీటా మదర్సాఆలీ తదితరులు పాల్గొన్నారు.




కంబాలచెరువులో డ్రోన్‌తో దోమల మందు పిచికారీ.. గంబూషియా చేప పిల్లలు విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము

కేపీఐను నమోదు చేయాలి

రాజమహేంద్రవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర- 2047 విజన్ లక్ష్యా లకు అనుగుణంగా నిర్దేశించిన ప్రాధాన్య పని తీరు సూచికలను(కేపీఐ) ఎప్పటికప్పుడు సం బంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ప్రశాంతి శనివారం ఆదేశించారు. జిల్లా, మండల స్థాయిలో నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక, వార్షిక పని తీరు సూచికల లక్ష్యాలను, ఇప్పటి వరకూ సాధించిన ప్రగతిని ఈ నెల 25లోపు స్వర్ణాంధ్ర వెబ్ సైటులో పొందుపర్చాలన్నారు. ఇకపై నెలవారీ కేపీఐని ప్రతి నెలా 5వ తేదీ లోపు పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. డేటా నమోదులో తప్పులు ఉంటే సరిచేయాలని సూచించారు. శాఖల వారీగా నిర్దేశించిన నెలవారీ లక్ష్యాలను జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయానికి జిల్లా అధికారులు సమర్పించాలని చెప్పారు.కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు,డీఆర్వో సీతారామమూర్తి, సీపీవో/జేడీ అప్పలకొండ, డ్వామా పీడీ నాగమహేశ్వరరావు,డీఎంహెచ్‌వో వెంకటేశ్వర రావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

ఏపీ విధానాన్ని మిగిలిన రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి

● ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర విధానాన్ని దేశంలో మిగిలిన రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ప్రజావేదిక సభా ప్రాంగణంపై సీఎం చంద్రబాబు సమక్షంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛభారత్‌కు చంద్రబాబు కన్వీనర్‌గా ఉన్నారన్నారు. ప్రతీ శనివారం అధికారులు, పారిశుధ్య కార్మికులు ప్రతీ ఒక్కరూ హాజరై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అలాగే చంద్రబాబు పేదరిక నిర్మూలనకు పీ4 అనే కార్యక్రమాన్ని తీసుకువచ్చి ప్రతీ కుటుంబం బంగారు కుటుంబం కావాలన్నదే ఆయన సంకల్పం అన్నారు. పెద్దాపురంలో 2,500 కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. మార్గదర్శకులుగా పారిశ్రామికవేత్తల సహకారంతో పేద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు చెప్పారు. అలాగే పీ4 కార్యక్రమానికి సంబంధించి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఓ కార్యాలయాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. గోదావరి, ఏలేరు జలాలు రెండు మున్సిపాలిటీలకు ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. అది కూడా నెరవేరిందన్నారు. 100 పడకల ఆసుపత్రిని అడిగినట్టు చెప్పారు. మెట్ట గ్రామాలకు మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సామర్లకోటకు డిగ్రీ కళాశాలను కోరుతున్నట్టు చెప్పారు.

పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి

పెద్దాపురం నియోజకవర్గానికి ఏదడిగినా చేస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప 100 పడకల ఆసుపత్రి కావాలన్నారని, తప్పకుండా అది నెరవేరుతుందన్నారు. అలాగే సామర్లకోటలో డిగ్రీ కళాశాల, అమృత్ పథకం కింద నిధుల మంజూరు, 15 మెగావాట్ల సామర్థ్యంతో రూ.330 కోట్లతో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు, సామర్లకోటలో ఇంటింటికీ కొళాయికి రూ.75 కోట్లు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు.

ప్రజల ఆలోచనా విధానంలో మార్పురావాలి : స్వచ్ఛాంధ్ర ర్యాలీలో సీఎం చంద్రబాబు

పెద్దాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర కల సాకారం కావాలంటే ప్రజలు తమ ఆలోచనా విధానంలో మార్పు రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఆయన శనివారం పాల్గొన్నారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి ఆయన రంగరాయ మెడికల్ కళాశాల విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ పాల్గొన్నారు. ఈర్యాలీ సుమారు 100 మీటర్ల పైబడి సాగింది. స్థానిక మిరపకాయవీధి రామాలయం వరకూ సాగింది. దారిలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర గురించి అవగాహన ఎంతమేర ఉందనే కోణంలో కళాశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సర్క్యులర్ ఎకానమీపై పాలసీ చేశామని, వాటివల్ల ఉపయోగాలపై మెడికల్ కళాశాల విద్యార్థులకు వివరించారు. అంటువ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం చెత్తేనని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెత్తపై పన్ను వేశారన్నారు. దారిపొడవునా ప్రతీ ఒక్కరినీ పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ అవసరమైన చర్యలను చేపట్టాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే చెత్త సేకరించే విధానం కోసం వారితో మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్త వాహనాన్ని తోసి కార్మికులను ఉత్సాహపరిచారు. అలాగే తడిపొడి చెత్త సేకరణను పరిశీలించారు. ర్యాలీలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రైన్‌ను పరిశీలించిన సీఎం

స్థానిక కుమ్మరి వీధిలో 95 అడుగుల పొడవుతో రూ.1.5 లక్షల వ్యయంతో నిర్మించిన మ్యాజిక్ డ్రైన్‌ను చంద్రబాబు పరిశీలించారు. అలాగే వాటివల్ల కలిగే ఉపయోగాలు, వాటి నిర్మాణం, వీటి ద్వారా కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసు కున్నారు. మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణం ద్వారా జల వనరులను కలు షితం చేయకుండా భూమి లోనే ఇంకిపోయేలా ఈ విధానం





పెద్దాపురంలో పారిశుధ్య కార్మికుడితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



పీ4 మార్గదర్శులు

బంగారు కుటుంబాలను సీఎం చంద్రబాబు సమక్షంలో దత్తత తీసుకుంటున్న లలితా ఇండస్ట్రీస్ ఎండీ మట్టే శ్రీనివాస్, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్



పెద్దాపురంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీలో సీఎం, వైద్య విద్యార్థినులు

అప్పుడు బాగుందా.. ఇప్పుడా..

స్వచ్ఛతా ర్యాలీలో డాక్టర్లు, వైద్య విద్యార్థులతో సీఎం ముచ్చట్లు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

పెద్దాపురంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ర్యాలీలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. పురవీధుల్లో నడిచారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాలొన్న వైద్య విద్యార్థులు, డాక్టర్లతో ఆయన సరదాగా ముచ్చటించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న మార్పులను ఏం గమనించారు? అని అడిగి తెలుసుకున్నారు? సర్క్యులర్ ఎకానమీ పాలసీ తీసుకొచ్చామని చెబుతూ వాటి ఉపయోగాలను మెడికల్ విద్యార్థులకు వివరించారు. వారి మధ్య జరిగిన సంభాషణ వారి మాటల్లోనే..

సీఎం చంద్రబాబు: మీరంతా డాక్టర్లమ్మా? ఎక్కడ ఏ కాలేజ్ అమ్మా?

డాక్టర్: అవును సర్, రంగరాయ మెడికల్ కాలేజ్

సీఎం: సర్క్యులర్ ఎకానమీ స్టార్ట్ చేస్తున్నాం. వాట్ ఈజ్ యువర్ అండర్ స్టాండింగమ్మా?

డాక్టర్: హా.. ఈ వేస్ట్ అండ్ బయోమెడికల్. రీ సైక్లేషన్.. సర్..

సీఎం: ప్రతి ఒక్క దానికి వేస్ట్ నుంచి హౌ టు క్రియేట్ వెల్త్.. రీ సైక్లేషన్ అండ్ ఆల్ సో..

డాక్టర్: ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసి.. సమ్ అదర్ బెటర్ దేన్ యుటిలైజ్ చేయడానికి, వాటర్, ఎయిర్ పొల్యూషన్‌ను తగ్గించవచ్చు సర్..

సీఎం: దీనికోసం సర్క్యులర్ ఎకానమీ పాలసీ తీసుకొచ్చాం. ఏదీ కూడా వేస్టు కాదు. వేస్టు నుంచి కంపోస్టు గానీ, లేకపోతే ఎనర్జీగానీ ఆర్ రీయూజ్‌గానీ, మళ్లీ బ్యాక్ టు....

డాక్టర్స్ : ఎస్.. సర్..

సీఎం: ఎంతమంది అమ్మా? మీ కాలేజీలో స్టూడెంట్స్?

డాక్టర్: 200 మెంబర్స్ బ్యాచ్..

సీఎం: ఏ ఇయరమ్మా మీరు?

డాక్టర్: 2017 బ్యాచ్ సర్.. మెడికల్ ఆఫీసర్స్‌గా పనిచేస్తున్నాం.

సీఎం: స్టాండర్డ్స్ బాగానే ఉన్నాయా.. లేదా తగ్గాయా..

డాక్టర్: బాగున్నాయ్ సార్ స్టాండర్డ్స్...

సీఎం: పాతకాలేజ్.. రంగరాయ మెడికల్ కాలేజ్ అంటే ఒక బ్రాండ్..

డాక్టర్: అవును సర్

సీఎం: పాత గవర్నమెంట్ చూశారు. ఇప్పుడు ఈ గవర్నమెంట్ చూస్తున్నారు. మీరు ఏమన్నా ఒక మార్పు చూస్తున్నారా?

డాక్టర్: సిస్టమ్‌లో చాలా మార్పులు వచ్చాయి సర్.. బేసికల్లీ సొసైటీలో మాకు రెస్పెక్ట్ పెరిగింది సర్.. యాజ్ ఏ డాక్టర్‌గా.. ఈ సాసా ప్రోగ్రామ్ వల్ల, వీటివల్ల ఏమవుతుందంటే.. పొల్యూషన్ లేకుండా ఎన్విరాన్‌మెంటల్ వెదర్ బోర్న్ డిసీజెస్ మలేరియా, డెంగీ కంట్రోల్ అయ్యాయి సర్..

సీఎం: మీకు విజిబుల్ కనిపిస్తోందమ్మా అది?

డాక్టర్: హాస్పిటల్స్ పీహెచ్‌సీలకు వచ్చే పేషంట్స్ బట్టి తెలుస్తుంది సర్..

సీఎం: కమ్యూనికల్ డిసీజెస్ కొంతవరకు ఏమైనా కంట్రోల్ అయ్యాయా?

డాక్టర్: ఎస్ సర్..

సీఎం: వాటర్ బోర్న్‌గానీ, వెదర్ బోర్న్‌గానీ కంట్రోల్ అవుతున్నాయా?

డాక్టర్: కంట్రోల్ అవుతున్నాయ్ సర్. ఇప్పటివరకు మా పీహెచ్‌సీలో మేము క్లీన్‌లీనెస్ అనేది చేసుకుంటాం సర్.. దట్ ఈజ్ అవర్ ప్రోగ్రామ్ టు రెస్పెక్ట్.. ఈ ప్రోగ్రాం వల్ల అందరికీ అవేర్‌నెస్ తీసుకొస్తున్నాం సర్..

ప్రభుత్వ పథకాల అమలులో కార్యకర్తలు కీలకం

సీఎం చంద్రబాబు





సామర్లకోటలో కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

సామర్లకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమం అమలులో పార్టీ కార్యకర్తలు కీలకం అయినందున అధికారులతోపాటు పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యకర్తలకు సూచించారు. శనివారం సాయంత్రం సామర్లకోట పూర్ణా కల్యాణ మండపంలో పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రతీ నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో కార్యకర్తలు పాల్గొని పారదర్శకత చూపాలన్నారు. ఈ-గవర్నెన్స్, క్వాంటమ్ మిషన్ వంటి పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కార్యకర్తలు ఎప్పటిక ప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అంతకు ముందు ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో వినూత్నంగా ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమం పేదప్రజల జీవితాల్లో వికాసం తెస్తుందన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో 2,500 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. మార్గదర్శకుల సహకారంతో ఆ కుటుంబాలను ఆదుకుంటామని సీఎం ఎదుట భరోసా ఇచ్చారు. సీఎం అందించిన ప్రోత్సాహంతో ఇప్పటివరకూ రూ.వెయ్యి కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు నిర్వహించగలిగానని, అలాగే గత 14 నెలల కూటమి ప్రభుత్వ హయాంలో రూ. 100 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే చినరాజప్ప సీఎం చంద్రబాబుకు తెలియజేశారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రతో మంచి ఫలితాలు : పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్

పెద్దాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రతో మంచి ఫలితాల అందిస్తున్నట్టు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ అన్నారు. సీఎం సమక్షంలో ప్రజావేదికపై ఆయన శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంతో జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడచిన 8 నెలలుగా ప్రజా భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2024నాటికి రాష్ట్రంలో 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ చెత్త పేరుకుపోయిందని, దీన్ని వచ్చే అక్టోబరు 2 నాటికి పూర్తిగా తొలగించనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో రోజుకు వెయ్యి మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతోందని, సర్క్యులర్ ఎకానమీ ప్లాన్ కింద చెత్త నుంచి సంపద సృష్టించేందుకు మెగా ప్లాంట్‌లను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఇప్పటికే విశాఖ, గుంటూరు ఈ ప్లాంట్‌లను ఏర్పాటుచేయగా, పెద్దాపురంలో ఏర్పాటుచేస్తున్నామన్నారు.

ట్రిపుల్ ధమాకా

● డీఎస్సీ ఫలితాల్లో టీజీటీ, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత సాధించిన మణికంఠ చంద్రశేఖర్ ● రంపయర్రంపాలెం యువకుడికి మూడు విభాగాల్లోను ర్యాంకులు ● జిల్లాస్థాయిలో టీజీటీలో 15వ ర్యాంకు



ఉంగరాల మణికంఠ చంద్రశేఖర్

గోకవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం రంప యర్రంపాలెం గ్రామానికి చెందిన ఉంగరాల మణికంఠ చంద్రశేఖర్ శనివారం విడుదలైన డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో టీజీటీ, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు అర్హత సాధించాడు. 2018లో జరిగిన డీఎస్సీలో మణికంఠ మొదటిసారి ప్రయత్నించి స్వల్ప తేడాతో అవకాశాన్ని కోల్పోవడం జరి గింది. కానీ పట్టువదలని విక్రమార్కుడిలా వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణపొంది 2025 డీఎస్సీలో టీజీటీ, ఎస్‌జీటీ, స్కూల్‌అసిస్టెంట్ మూడు విభాగాల ఉపాధ్యాయ ఉద్యోగాలకు పరీక్ష రాశారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో జిల్లా స్థాయిలో టీజీటీలో 15వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్‌లో 23వ ర్యాంకు, ఎస్‌జీటీలో 59వ ర్యాంకు సాధించి మూడింటిలోనూ ఉద్యోగానికి అర్హత సాధించారు. స్కూల్‌అసిస్టెంట్‌గా జడ్పీ ఉన్నతపాఠశాల గణితశాస్త్రం ఉపాధ్యాయుడిగా చేరతానని మణికంఠ తెలిపాడు. మణికంఠ తండ్రి గోకవ రంలో టైలర్ వృత్తి చేస్తుంటాడు.

డీఎస్సీలో అనూష, నాగేశ్వరరావు, శ్రీనివాస్ ప్రతిభ





నాగేశ్వరరావుకు 9వ ర్యాంకు, అనూషకు 69వ ర్యాంకు

కపిలేశ్వరపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం వడ్లమూరు గ్రామానికి చెందిన పాలింగి అనూష ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 86.39 మార్కులు సాధించి జిలాల్లో 69వ ర్యాంకు, ఎస్సీ క్యాటగిరీలో 5వ ర్యాంకు సాధించింది. నిరుపేద కుటుంబమైన పాలింగి శ్రీనివాస్, బేబి దంపతుల రెండవ కుమార్తె అనూష. వివాహిత అయిన ఈమె అత్తవారిల్లు కందులపాలెం. భర్త ఫోటో గ్రాఫర్, ఈమె 1 నుంచి 5 వరకు వడ్లమూరు ప్రాథమిక పాఠశాలలో, 6 నుంచి 10వరకు కాలేరు ఉన్నత పాఠశాలలో చదివింది. ఇంటర్మీడియట్ రామచంద్రాపురంలోను, డీఎడ్ బొమ్మూరు డైట్‌లో చదివి ఈ ర్యాంకు సాధించింది. అలాగే మాచరమట్ల గ్రామానికి చెందిన పిల్లి నాగేశ్వరరావు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)లో జిలాల్లో 9వ ర్యాంకు సాధించాడు. తండ్రి సత్యనారాయణ, దంపతులు వ్యవసాయ కూలీలు కాగా ఆకుటుంబంలో జన్మించిన నాగేశ్వరరావు జిల్లాస్థాయిలో 9వ ర్యాంకు సాధించినట్లు తెలిపాడు. వల్లూరు గ్రామానికి చెందిన సిద్దాంతపు శ్రీనివాస్ 83 మార్కులతో పీఈటీగా సెలెక్ట్ అయ్యి జిల్లాస్థాయిలో 25వ ర్యాంకు, బీసీ-ఎలో 3వ ర్యాంకు సాధించాడు. తండ్రి వ్యవసాయ కూలీకాగా శ్రీనివాస్ 1 నుంచి 5వరకు వల్లూరు మెయిన్ పాఠశాలలో 6 నుంచి 10వరకు వల్లూరు హైస్కూల్‌లో చదివాడు. పీఈటీ ట్రైనింగ్ గోపన్నపాలెం పశ్చిమగోదావరిజిల్లాలో చదివినట్లుతెలిపాడు.

డీఎస్సీలో గాయత్రికి జిల్లాలో 3వ ర్యాంకు



తోలేటి గాయత్రి

సీతానగరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా సీతానగరం మండలంలోని లంకూరుకు చెందిన తోలేటి గాయత్రి ఏపీ మెగా డీఎస్సీలో సెకండ్‌గ్రేడ్ టీచర్ పోస్టుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. గాయత్రి జీవనపోరాటంలో అనేక కష్టాలను అధిగమించారు. రైతు కుటుంబానికి చెందిన గాయత్రి 2003లో పదో తరగతి పూర్తిచేసి తర్వాత కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో విద్య ఆగిపోయి వివాహం చేసుకున్నారు. 2012లో భర్తను కోల్పోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. తనలోని ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మళ్లీ చదువు ప్రారంభించారు. తన చిన్ననాటి కల అయిన టీచర్ అవ్వాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఓపెన్ ఇంటర్ పూర్తిచేశారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సును విజయవంతంగా పూర్తిచేశారు. ఎటువంటి కోచింగ్ సెంటర్ సహాయం లేకుండా స్వయం కృషితో డీ ఎస్సీలో 93.5శాతం మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. తన విజయానికి ప్రేరణ ఇచ్చిన తాతయ్య చేకూరి అరవాలురాజు, తల్లిదండ్రులు తోలేటి సూర్యనారాయణ, నాగమణి ఇద్దరు సోదరులు ఉపాధ్యాయులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

డీఎస్సీలో బలరామపురం యువకుల ప్రతిభ



పైల శివకుమార్



దడాల దుర్గాప్రసాద్

రౌతులపూడి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదలచేసిన ఉపాధ్యాయుల నియామకాల్లో బలరామపురం గ్రామానికి చెందిన పైల శివకుమార్, దడాల దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచారు. పైల శివకుమార్‌కు ఫిజికల్ సైన్స్‌లో రాష్టంలో ఆరో ర్యాంక్ రాగా, జోన్ రెండోస్థానంలో నిలిచాడు. డీజీటీ సైన్స్‌లో రాష్టంలో ఐదో స్థానం, జోన్ మొదటి స్థానంలో, టీజీటీ ఫిజికల్ సైన్స్ జోన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇప్పటికే సెంట్రల్లో రాస్టిరియా మిలటరీలో ఉద్యోగం సాధించాడు. దండాల దుర్గాప్రసాద్ టీజీటీ హిందీర్యాంక్ 8 సాధించాడు.

డీఎస్సీలో వీరవేణికి 19వ ర్యాంక్



ఉందుర్తి వీరవేణి

కరప, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరప గ్రామంలో నివాసముంటున్న ఉందుర్తి వీరవేణి డీఎస్సీ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా స్థాయిలో 19వ ర్యాంక్ సాధించారు. అంబేడ్కర్ కోనసీమజిల్లా రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన ఈమె బీఎస్సీ (సీబీజడ్) చదివి ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ఎఫ్ఎన్‌వోగా పనిచేస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఆమె కరపలో ఉంటూ ఒకపక్క ఉద్యోగం చేస్తూ మరోపక్క డీఎస్సీకి నిర్విరామంగా చదివి రెండో ప్రయత్నంలో ఓపెన్ కేటగిరీలో ఈర్యాంక్ సాధించారు. బయోలాజికల్ సైన్స్ విభాగంలో స్కూల్‌అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. ఆమె భర్త భరత్‌కుమార్ పాత్రికేయుడిగా పనిచేస్తుండగా, కుమారుడు డిప్లొమో, కుమార్తె ఇంటర్‌చదువుతున్నారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ)/రాజానగరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఎస్సీ మహిళలకు, పురుషులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో జిల్లాకు ఐదుగురు పురుషులకు, ఐదుగురు స్త్రీలకు, మొత్తం 30 మందికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (హెచ్‌ఎంవీ) ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి తెలిపారు. వయస్సు 20 సంవత్సరాల పైబడిన, ఆసక్తిగల షెడ్యూల్డు కులాలు అభ్యర్థులు, కనీసం ఒక స1ంవత్సరం కాలపరిమితిగల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (ఎల్‌ఎంవీ) లైసెన్స్ కలిగి ఉన్న పురుషులు, స్త్రీలు ఈనెల 27న సాయంత్రం ఐదు గంటలలోపు కాకినాడ ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఈడీ తెలిపారు. వివరాలకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ కె.నందేశ్ సెల్ నెం.7671949476 సంప్రదించాలని తెలిపారు.





ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, దర్శనం కోసం బారులుతీరిన భక్తజనం

వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.60.16 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొ క్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కా నుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.60.16లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

తొలితిరుపతికి భక్తుల రద్దీ



శృంగారవల్లభస్వామి

పెద్దాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,33,380, అన్నదాన విరాళాలు రూ.64,368 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.1800, ప్రసాద విక్రయం ద్వారా 15,990, తులాభారం ద్వారా రూ.50, కానుకలద్వారా రూ.111 వెరసి రూ. 2,15,699 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు ఐదువేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

శివాంజనేయ నర్సరీని సందర్శించిన

హైకోర్టు జడ్జి కిరణ్మయి

కడియం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కిరణ్మయి శనివారం కడియపులంక మల్లు పోలరాజు-శివాంజనేయ నర్సరీని సందర్శించారు. ఆమెకు నర్సరీ రైతు పోలరాజు మొక్కను అందజేసి స్వాగతించారు. కిరణ్మయి నర్సరీలో వివిధ రకాల మొక్కలు చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడియం నర్సరీల గురించి తాను విన్నానని, ఇక్కడ ఎయిర్ ప్యూరిఫైర్, ఆర్కిడ్స్ తదితర ఎటువంటి మొక్కలైనా అందుబాటులో ఉంటాయని, తమకు కావాల్సిన కొన్నిరకాల మొక్కలు కొనుగోలు చేసేందుకు వచ్చామని తెలిపారు. మట్టి లేకుండా గాలిలో తేమను మాత్రమే తీసుకుని పూలను వికసిస్తున్న మొక్కలు తనను ఆకర్షించాయన్నారు. 20నుంచి 40 ఏళ్లనాటి విదేశీ బొన్సాయ్ మొక్కలు పదుల సంఖ్యలో ఉండడం విశేష మన్నారు. కార్యక్రమంలో నర్సరీ రైతు మల్లు శివ, తదితరులు ఉన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న జస్టిస్ కిరణ్మయి

ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్‌కు

రూ.88 కోట్లతో డీపీఆర్ సిద్ధం

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



రూ.88 కోట్ల డీపీఆర్‌ను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి అందజేస్తున్న టూరిజం అధికారులు

బిక్కవోలు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మించిన బిక్కవోలులోని శ్రీలక్ష్మీగణపతి, శ్రీగోలింగేశ్వర, శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలతోపాటు గొల్లల మామిడాడలోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయాలను ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్ పేరుతో అభివృద్ధి చేసేందుకు రూ.88 కోట్లతో టూరిజం శాఖాధికారులు డీపీఆర్ సిద్ధం చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరంలో శనివారం టూరిజం శాఖ అధికారులు ఎమ్మెల్యేను కలసి ఈ మూడు ఆలయాలను కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఆదేశాలతో రాష్ట్ర పర్యాటకశాఖ రూపొందించినట్లు టూరిజం ఈఈ విజయభాస్కరరెడ్డి, కన్సల్టెంట్ పావని, వినోద్ వివరించి డీపీఆర్‌ను అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే ఈమూడు ఆలయాలను అభివృద్ధి చేయడం కోసం డీపీఆర్‌ను పరిశీలించి దానిలో మార్పులు, చేర్పులు చేసి రాష్ట్ర టూరిజంశాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తుది నివేదిక అందిస్తామని తెలిపారు.

నిలకడగా గోదావరి వరద

- తేరుకుంటున్న గ్రామాలు
- కోనసీమ జిల్లాలో 4527 మంది నిరాశ్రయులు
- కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రకటన

అమలాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి శాంతిస్తుంది. శనివారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ దగ్గర ఉదయం రెండో ప్రమాద హెచ్చరికను, రాత్రి 7 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసహరించుకుంటున్నట్టు ఇరిగేషన్ అధికారి ప్రకటించారు. దాంతో 9.85 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదలడంతో కోనసీమలోని గౌతమి, వశిష్ట, వైనతేయ, వృద్ధగౌతమి నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా జిల్లాలో పలు కాజ్‌వేలు ఇంకా జల దిగ్బంధంలోనే ఉన్నాయి. పలు లంక గ్రామాలకు వరద ఉధృతి వల్ల రవాణా సౌకర్యాలు స్తంభించి ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాకలిపాలెం, మూలస్థానం, అప్పనపల్లి, ఎదురుబిడియం కాజ్‌వేలలో శనివారం రాత్రికి వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రానికి జిల్లాలో కాజ్‌వేలతో పాటు లంక గ్రామాలు వరద నీటి నుంచి బయట పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో జరిగిన పంటలు, ఇతర నష్టాలపై అధికారులు ప్రత్యేక బృందాలతో అంచనాలు సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు.

7 పునరావస కేంద్రాల ఏర్పాటు

గోదావరి వరదల కారణంగా కోనసీమ జిల్లాలో 1291 కుటుంబాల వారు ముంపు బారిన పడి 4527 మంది నిరాశ్రయులయ్యారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వరద ఉధృతి తగ్గుముఖం పట్టినట్టు వెల్లడించారు. ఇప్పటివరకూ 3 కుటుంబాల్లో 10 మందిని సురక్షిత కేంద్రాలకు తరలించామని, బాధితుల కోసం 7 పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 1098 గృహాలు ముంపు బారిన పడాయి. బాధితుల తరలింపునకు 23 బోట్లు సిద్ధం చేసి 283 మందికి సహాయక చర్యలు చేపట్టాం. 400 ఆహార పొట్లాలు 810 టిన్నెలు వాటర్ సప్లై చేసినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో బోడసుకుర్రు పల్లిపాలెం, లంక ఆఫ్ ఠాణేలంక, పాశర్లపూడి లంక, చింతపల్లిలంక, కూనలంక, గుర్రుజాపులంక, లక్ష్మీదేవిలంక, గోడిలంక, కొండుకుదురు గ్రామాలు ముంపు బారిన పడినట్టు చెప్పారు.


అలమూరు మండలం జొన్నాడ పుష్కర్‌ఘాట్ వద్ద వరద ప్రవాహం




పి.గన్నవరం మండలం గంటిపెదపూడి ఏటిగట్టు దిగువున జలదిగ్బంధంలో అరటితోట, మామిడికుదురు మండలం పాశర్లపూడి శ్రీరామ్‌పేటలో వరదనీరు, కోటిపల్లి పుష్కరాల రేవులో తగ్గిన గోదావరి వరద ప్రవాహం


పి.గన్నవరం: గంటిపెదపూడి వద్ద బూరుగులంక నదిపాయలో పడవ ప్రయాణం

శాంతించిన శబరి


చింతూరు - కుయుగూరు నడుమ జాతీయ రహదారిపై ప్రారంభమైన రాకపోకలు

చింతూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆరురోజుల పాటు ఉధృతంగా ప్రవహించిన శబరి నది శనివారం ఉదయం నుంచి తగ్గడం ప్రారంభించింది. దీంతో లోతట్టు వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిస్సాకు వెళ్లే 30వ నంబరు జాతీయ రహదారిపై వరద నీరు తగ్గడంతో రాకపోకలు పునరావృతమయ్యాయి. కాగా సోకిలేరు వాగుపై ఇంకా వరద నీరు ఉండడంతో చింతూరు - వరరామచంద్రపురం నడుమ శనివారం కూడా రాకపోకలు సాగడం లేదు.

ధవళేశ్వరంలో వరద ఉధృతి తగ్గుముఖం

- ప్రమాద హెచ్చరికలు ఉపసంహరణ
- వేగంగా తగ్గుతున్న నీటి మట్టం

ధవళేశ్వరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతుంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి 14.30 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం శుక్రవారం సాయంత్రం నుంచి తగ్గుతూ శనివారం తెల్లవారుజామున 2గంటలకు 13.70 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. ఆపై వేగంగా తగ్గుతున్న నీటి మట్టం 17గంటల వ్యవధిలో శనివారం రాత్రి 7గంటలకు 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 10,04,000వేల క్యూసెక్కులు దిగువకు వదిలారు. రాత్రి 8గంటలకు నీటి మట్టం 11.50 అడుగులకు చేరుకోగా 9,57,297 క్యూ సెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ఎగువన అన్నిప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుతోంది. భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటి మట్టం శనివారం రాత్రి 8గంటలకు 36 అడుగులకు చేరుకుంది.


కాటన్ బ్యారేజ్ దిగువున వరద ప్రవాహం

లారీ ఢీకొని సర్పంచ్ మృతి

రామన్నపాలెంలో విషాదఛాయలు



సర్పంచ్ బుల్లారావు (ఫైల్), ప్రమాదానికి కారణమైన లారీ

దేవరపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌ను టిప్పర్ లారీ వేగంగా ఢీకొనడంతో ఓ గ్రామ సర్పంచ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం రామన్నపాలెం గ్రామ సర్పంచ్ కూచిపూడి బుల్లారావు (71) శనివారం దేవరపల్లి పెట్రోల్ బంక్‌కు వెళ్లడానికి వస్తుండగా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లికి చెందిన టిప్పర్ లారీ దుద్దుకూరు మెటల్ కోసం వెళ్తోంది. ఈ క్రమంలో దేవరపల్లి పెట్రోల్‌బంకు వద్ద ఎదురుగా వెళ్తున్న మోటర్‌సైకిల్‌ను టిప్పర్ లారీ వేగంగా ఢీకొని సుమారు 20గజాల దూరం ఈడ్చుకుని వెళ్లిపోయింది. దీంతో బుల్లారావు ము ఖభాగమంతా నుజ్జునుజ్జుఅయ్యింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ విజయ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుల్లారావుకు భార్య, ఇద్దరు కుమారులు, కు మార్తె ఉన్నారు. కుమారుడు కూచిపూడి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శవపంచనామా అనంతరం స్వగ్రామం రామన్నపాలెం తరలించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.బుల్లారావు పార్థివదేహానికి మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, ఎంపీపీ కేవీకే దుర్గారావు నివాళలర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అయితే లారీకి ముందు భాగంలో సగభాగం అద్దానికి స్టిక్కర్లు, బొమ్మలతో అలంకరించడంతో ఎవరు వెళ్తున్నది సరిగా కనిపించకుండా ఉండే విధంగా ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఠాణేలంక మొల్లిలో చోరీ

- ఇంట్లో వెండి, బంగారం వస్తువులు మాయం

ముమ్మిడివరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ ఠాణేలంక మొల్లిలో ఇంట్లో దొంగలు పడి వెండి, బంగారం వస్తువులను చోరీ చేశారు. ఠాణేలంక మొల్లికి చెందిన సానబోయిన వెంకటసత్యనారాయణ గురువారం కుటుంబసభ్యులతో కలిసి కర్నాటక తీర్థయాత్రలకు వెళ్లాడు. అయితే ఇంటికి పాలు తీసుకుని వచ్చే వ్యక్తి శుక్రవారం యథావిధిగా పాలు తీసుకొచ్చి ఇంటి వద్ద పెట్టి వెళ్లిపోయాడు. శనివారం కూడా పాలు తీసుకొచ్చి పెట్టగా ముందురోజున పెట్టిన పాలు అలాగే ఉండడంతో ఇంట్లోకి చూడగా తలుపులు పెకిలించి ఉండడాన్ని గమనించాడు. వెంటనే విషయాన్ని సత్యనారాయణకు ఫోన్‌లో తెలుపగా తాను తీర్థ యాత్రలకు వెళ్లానని చెప్పడంతో ఆ విషయాన్ని బంధువులకు తెలపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో బీరువాలో భద్రపరిచిన 49 తులాల వెండి, నాలుగు బంగారపు రూపులు, రూ.2వేల నగదును దొంగిలించుకుపోయినట్టు సమాచారం. దుండగులు తలుపులు పెకిలించి ఇంటి బీరువాను బద్దలు గొట్టి వస్తువులు, నగదు దొంగిలించుకుపోయారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీం బృందం అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు.


బీరువాలో చెల్లాచెదురుగా ఉన్న వస్తువులు


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

రాచపల్లిలో మహాకుంభాభిషేకం


నాయినార్ల విగ్రహాలకు అభిషేక జలాలు తీసుకొస్తున్న దృశ్యం


నాయినార్లకు పల్లకీ సేవ

ప్రత్తిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో శనివారం నాయినార్ల మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వరుని ఆలయ ప్రాంగణంలో 63మంది నాయినార్ల విగ్రహాలకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా అభిషేకాలు చేపట్టారు. విగ్రహాలకు ఆలయ వ్యవస్థాపకులు రామానంద స్వా మి, నాయినార్ల చరిత్ర కారిణి అరుణాచల మా ధవి ఆధ్వర్యంలో మహామండలాభిషేకాలు ని ర్వహించారు. 63 మంది నాయినార్లతో పాటు దక్షిణామూర్తి, శ్రీ లక్ష్మీ హైయిగ్రీవ సూర్యభగవాన్, కాళభైరవ, భరతమాత, గంగామాతలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అన ంతరం తమిళనాడు నుంచి విచ్చేసిన వాయిద్య విద్వాంసుల మంగళవాయిద్యాల మధ్య 63 మంది నాయినార్లకు పల్లకీ సేవ నిర్వహించారు.


- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

బండి.. జాగ్రత్తండి..

కాకినాడలో మోటార్ తొట్టి రిక్షాపై ఓ వ్యక్తి వాహనదారులను తీసుకెళ్తూ ఇలా కనిపించాడు. లోడు తీసుకెళ్లే బండిపై ప్రయాణికులంటే జాగ్రత్త పడాల్సిందే.

వీఆర్వో ఆకస్మిక మృతి


అనోజ్‌కుమార్ (ఫైల్)

కూనవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూన వరం మండలం మర్రిగూడెం పం చాయతీకి చెందిన వీఆర్వో పి. అనో జ్‌కుమార్ ఆకస్మికంగా మృ తి చెందారు. అనోజ్‌కుమార్ కూనవరానికి గోదావరి అవతలి ఒడ్డున ఉన్న ఏలూరు జిల్లా వేలేరుపాడు నుంచి విధులకు రాకపోకలు సాగిస్తూ ఉండేవారు. 2 రోజులుగా గోదావరి వరద ఉధృతం కావడంతో పడక రాక పో కలు నిలిచిపోయాలు. దీంతో అనోజ్ కుమార్ చూచురేవుల సచివాలయం కార్యాలయంలో ఉండి విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో ఒంటరిగానే నిద్రపోయేవారు. అయితే శనివారం ఉదయం సచివాలయం సిబ్బంది కార్యాలయానికి వెళ్లి చూడగా అనోజ్ కుమార్ పడిపోయి ఉన్నారు. దీంతో సచివాలయ సిబ్బంది కోతులగుట్ట ఆసుపత్రికి ఆటోలో తరలించగా అనోజ్‌కుమార్ మృతి చెందినట్టు డాక్టర్ నిర్ధారించారు. వీఆర్వో 2 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నట్టు తెలిసింది. ఫిట్స్ కారణంగా మృతి చెందిఉంటాడని డాక్టర్లు చెప్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు


రవాణాశాఖ ప్రిన్స్‌పాల్ సెక్రటరీకి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ఈవో


సత్యదేవుడి దర్శనానంతరం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమలత

అన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం పలువురు ప్రముఖులు స్వామిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వారిలో రవాణాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి, చిల్లకూరు సుమలత కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్ స్వామిని దర్శించిన వారిలో ఉన్నారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం


ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన కేవిపి బాప న్న రూ.1,00,116 విరాళం ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. ఆయన దాతను అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం దేవస్థానంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నక్షత్రవనం, సత్యగిరి ప్రాంగణాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ గుర్రాజు, యనమల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ జిల్లా అన్నవరంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈవో సుబ్బారావు

లారీ ఢీకొని ఆర్ఎంపీ మృతి

పశ్చిమగోనగూడెం వద్ద ఘటన

కోరుకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఆర్ఎంపీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు యేగి ప్రేమ్‌కుమార్(44) మోటార్‌సైకిల్‌పై కోరుకొండ బయలుదేరాడు. మార్గమధ్యంలో కోరుకొండ మండలం పశ్చిమగోనగూడెం సింహపురి లే అవుట్ వద్దకు వచ్చేసరికి ఓ లారీ అతి వేగంగా వచ్చి ప్రేమ్‌కుమార్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా పూర్తి చేశారు.

బైక్ ఢీకొని లారీ క్లీనర్ మృతి

ప్రత్తిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన క్లీనర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అన్నవరం వైపు నుంచి రాజమండ్రి వెళ్తున్న లారీ శుక్రవారం రాత్రి స్థానిక ధర్మవరం హైవేపై ఉన్న పెట్రోల్ బంక్ వద్ద నిలిపి క్లీనర్ పఠాన్ సుభాన హైవే రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన మోటార్ బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సుభానును స్థానిక ఆసుపత్రికి తరలించగా అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడిది గుంటూరు జిల్లా తెనాలి మండలం కాతేవరం గ్రామంగా పోలీసులు గుర్తించారు. శనివారం మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ప్రకాశం త్యాగం అపూర్వం

జేసీ చిన్నరాముడు


టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ

రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగం అపూర్వమని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు కొనియాడారు. ప్రకాశం జయంతిని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు చూపిన నిజాయితీ, ధైర్యం, ప్రజాసేవ నేటి తరానికి మార్గదర్శకాలన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన ఆయన ఆలోచనలు సమాజంలోని న్యాయం, సమానత్వం, సాధనకు ప్రేరణనిస్తాయన్నారు. బ్రిటిషర్లకు ఎదురు నిలిచి తుపాకీకి గుండెను చూపిన సాహసం ఎన్నటికీ మరువలేనిదన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సీతా రామమూర్తి, జిల్లా సర్వే అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆశయాల సాధనకు కృషి

స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాల సాధనకు అందరం కృషి చేయాలని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం మురళీ కృష్ణ పేర్కొన్నారు. ప్రకాశం జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పోలీసు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సైమన్ గోబ్యాక్ అంటూ బ్రిటీషర్ల తుపాకీ గుండ్లకు ఎదురు నిలిచి ఆంధ్రకేసరిగా ఖ్యాతి గడించారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన తెగువ, ధైర్యం ఆదర్శనీయమని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 1 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

షాపుల తనిఖీలో ఆర్డీవో కృష్ణనాయక్


రేషన్‌షాప్‌ను తనిఖీచేస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులందరికీ వచ్చేనెల 1వ తేదీ నుంచి రేషన్ షాపుల వద్ద స్మార్ట్ కార్డులు అందుబాటులో ఉంటాయని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. శనివారం ఆయన రాజమహేంద్రవరం విద్యానగర్‌లోని రేషన్ షాపు నెంబరు 103, 68లను తనిఖీ చేసి స్టాకును పరిశీలించారు. ఈ దుకాణాల్లో 114 క్వింటాళ్ల బియ్యం, 300 కిలోల పంచదార ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈనెల 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పం పిణీకి మ్యాపింగ్ చేసి అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు చెప్పారు. ప్రింటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయాలకు కార్డులు చేరుకుంటాయని, అపై సచివాలయాలకు వెళతాయని, వాటిని విలేజ్ సెక్రటరీ మ్యాప్ చేసి రేషన్ డీలర్లకు అందిస్తారని చెప్పారు. ఈనెల 25 నుంచి పంపి ణీ ప్రారంభిస్తారని వచ్చేనెల 1నుంచి రేషన్ షాపుల వద్దే స్మార్ట్ రైస్ కార్డులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రజలు వాటిని పొందాలని సూచించారు.

'హిందువునన్న భావన ప్రతి ఒక్కరిలో ఉండాలి'

సీతానగరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నేను హిందువుని అన్న భావన ప్రతి హిందువులోను ఉండాలని విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర, దక్షిణాంధ్ర ప్రాంత కార్యదర్శి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం సీతానగరం విష్ణు ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందువులందరూ గుడికెళ్లి పూజలు చేస్తారు, ఉపవాసాలుంటారు, కాని ఏ ఒక్కరికి తాను హిందువనన్న భావన ఉండదన్నారు. ఈ భావన ప్రతి ఒక్కరిలోను పెంపొందించుకోవాలంటే ప్రతి గ్రామంలోను సత్సంగాలు ఏర్పాటుచేసుకుని హిందువులు అందరు కలసి సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని తద్వారా హిందువులలో ఐకమత్యం ఏర్పడుతుందన్నారు కార్యక్రమంలో అర్చక పురోహిత మత మందిర్ ప్రముఖ్ నరశింహాశర్మ, విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి దోనేపల్లి సీతారాముడు, బీజేపీ మండలాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, ముళ్ళపూడి నరసింహారావు, సుంకర సూర్యచంద్రరావు, మేడిపూడి గోపాల కృష్ణారావు, యలమాటి సురేష్, చెరుకూరి ఫణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇషా క్రీడా పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొవైస్ ఛాన్సలర్ రాజు

రాజానగరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇషా గ్రామోత్సవంలో భాగంగా రూరల్ ప్రీమియర్ లీగ్-2025 జిల్లా క్లస్టర్ మ్యాచ్‌లు జీజీయూ ప్రాంగణంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.దీనికి అతిథులుగా విచ్చేసిన ప్రో వైస్ ఛాన్సలర్ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ మాట్లాడుతూ ఇషా ఫౌండేషన్ సామాజిక బాధ్యతగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఇషా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ క్రీడోత్సవంలో భాగంగా ప్రస్తుతం మొదటి స్థాయి క్లస్టర్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని, ఇందులో పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు శనివారం, ఆదివారం జరుగుతాయన్నారు.ఈ పోటీల్లోని విజేతలు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రస్తుతం 11 జిల్లాల్లో ఇషా రూరల్ ప్రీమియర్ లీగ్ జరుగుతోందన్నారు. అనంతరం రాజు వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంపిణీకి 2 వేల వినాయక ప్రతిమలు

దివాన్‌చెరువు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితికిమట్టి వినాయకులను పూజించాలని కోరుతూ ప్రజలకు పంపిణీ చేసేందుకు 2 వేల బొమ్మలు సిద్ధం చేస్తున్నామని దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులే స్వయంగా తయారుచేస్తున్నారన్నారు. ఈనెల 25 నుంచి విద్యార్థులతో బాటు ప్రజాప్రతినిధులు అందజేస్తామన్నారు. మట్టి ప్రతిమలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

మట్టి ప్రతిమల పంపిణీ

రంగంపేట, ఆగస్టు, 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రాఫ్ట్ టీచర్ వై.ప్రసన్న ప్రోత్సాహంతో వినాయక ప్రతిమలు తయారు చేసి తోటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. భక్తి, కళా నైపుణ్యాలతో ప్రతిమలు చేసిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఎన్‌జే భాస్కరరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.23.24 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


మనోజ్‌రెడ్డితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అనపర్తి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం అనేక మంది పేదలు అప్పుల బారిన పడి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని అటువంటి ఇబ్బంది ఏ పేద వాడు పడకూడదన్న ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు ముఖ్యమంత్రి సహాయనిధికి పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని రామవరంలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న ని యోజకవర్గ పరిధిలోని 33 మంది లబ్ధిదారులకు రూ.23.24 లక్షల వి లువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఆళ్ల గోవిందు, రావాడ నాగు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి

శనివారం కాకినాడ జిల్లా పెద్దాపురం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఇద్దరితోను చంద్రబాబు కొద్దిసేపు మాట్లాడారని,మనోజ్‌రెడ్డితో నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అన్నివర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం: టీకే

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): దేశంలో అన్ని వర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో భారతదేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. దేశంలో కుల గణన, జనగణనకు శ్రీకారం చుట్టడానికి ఆయన చేసిన పోరాటమే కారణమన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి వస్తే ప్రధాన మంత్రిగా రాహుల్‌గాంధీ అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇస్తారని, బీసీలకు రిజర్వేషన్లు శాతం 42కు పెరుగుతుందన్నారు. అలాగే రాజీవ్ ఫౌండేషన్ జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో మహిళలు ఎదుగుదలపై కేసు స్టడీ పోటీలు జరిగాయని, దీనిలో జిల్లాకు చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణకుమారి రాజకీయ ప్రయాణంపై రాజానగరం మండలానికి చెందిన దూలం అరుణ్‌తేజ సమర్పించిన కేసు స్టడీ 7వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. ప్రస్తుతం అరుణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిలో ఉన్నారని టీకే పేర్కొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

- డీఎల్‌పీవో నాగలత
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు
- పలుచోట్ల అవగాహన ర్యాలీలు


అనపర్తిలో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎల్‌పీవో నాగలత

అనపర్తి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, వీధులు శుభ్రంగా ఉంటే గ్రామాలు శుభ్రంగా ఉంటాయని తద్వారా రాష్ట్రం, దేశం పరిశుభ్రంగా మారుతాయని రాజమహేంద్రవరం డీఎల్‌పీవో నాగలత అన్నారు. శనివారం పలుచోట్ల స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు చేపట్టారు. అనపర్తిలోని నాలుగో సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డీఎల్‌పీవో పాల్గొని స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె అధికారులతో కలిసి పాల్గొన్నారు. అలాగే స్థానిక మంజు అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన హ్యాండ్ వాష్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఫణి, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజానగరం: జీజీయూలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చక్రద్వారబంధంలో గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో పాటించాల్సిన శుభ్రత, నీరు నిల్వ లేకుండా తీసుకోవాల్సిన చర్యలు, అపరిశుభ్ర పరిసరాల వల్ల కలిగే అనారోగ్యాలపై ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా పంచాయతీ అధికారులతో కలిసి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వాణి, కార్యదర్శి ఎం.సత్యవాణి, ఎన్ఎస్ఎస్ అధికారి బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత గూర్చి, హేండ్ వాష్ గూర్చి, దోమలు పెరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, తడి, పొడి చెత్త గూర్చి వివరించారు. ర్యాలీ జరిపి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, మండల వైద్యాధికారి డాక్టర్ దుర్గాదేవి, ఎంఈవో సీహెచ్ వీవీ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో ఊలపల్లిలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు,కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు.

రంగంపేట: రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీవో వీవీ సాయిబాబు ప్రారంభించి మాట్లాడారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. ఇల్లు, వీధులు, గ్రామ పరిసరాలు పరిశుభ్రతపై ప్రచారం ఎక్కువ చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులు, గ్రామస్థులు సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చేతుల పరిశుభ్రతపై ప్రయోగాత్మకంగా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.అనసూయ, ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, పీహెచ్‌సీ డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మీ, సచివాలయ ఈవో వి.శ్రీరామమూర్తి, హెచ్‌ఎం వి.పార్థసారధి, ఈవోపీఆర్డి సుబ్రహ్మణ్యం, ఏపీవో కె.నాగశేషవేణి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యర్థాలు లేని వాతావరణాన్ని కార్యాలయాల్లో కల్పించే దిశగా అడుగులు వేస్తున్నట్టు లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కె.శాంతకుమారి, కృష్ణవేణి, కే శేఖర్, జయరాజు, పద్మ, జానీ, దుర్గారావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రైతు బజార్‌లోని ప్రతి రైతు, రైతు బజార్‌కు వచ్చే వినియోగదారుడు మాన్సూన్ హైజీన్ పాటించాలని, రోగాల వ్యాప్తిని నిరోధించాలని క్వారీ మార్కెట్ రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ ఎస్.రోజియా అన్నారు. రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ రైతు బజార్‌లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో రైతు బజార్‌లోని రైతులు, డ్వాక్రా వ్యాపారులు తదితరులకు ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించారు. రైతు బజార్ ఆవరణలో ఎక్కడా నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవడం, బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మరుగుదొడ్లలో ఫినాయిల్‌తో శుభ్రం చేయించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని నినాదాలు చేశారు. రైతు బజార్ సిబ్బంది, రైతులు,డ్వాక్రా మహిళలు, వినియోగదారులు పాల్గొన్నారు.


రంగంపేటలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



క్వారీ మార్కెట్ రైతు బజార్‌లో అవగాహన కార్యక్రమం

పీ4తో సమగ్రాభివృద్ధి: బత్తుల


కోరుకొండలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ పీ4 కార్యక్రమం ద్వారా పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధి సాధించడమే పీ4 కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీ4పై అధికారులతో సమీక్ష నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు ప్రైవేట్ రంగం, సీఎస్ఆర్ నిధులను వినియోగించి మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, ఉపాధి రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి చేయడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అడ్డాల శ్రీను, ముక్కా రాంబాబు, దేవన దుర్గాప్రసాద్, యర్రంశెట్టి పోలారావు, బదిరెడ్డి దొర, తాటికొండ బుజ్జి, తాటికొండ శ్రీను పాల్గొన్నారు.

రహదారి పనులపై సమీక్ష

రాజానగరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా రాజానగరం నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు రాజమహేంద్రవరంలోని ఆయన కార్యాలయంలో ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా సీతానగరం రోడ్డు అభివృద్ధి పనులు తక్షణమే ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. రహదారి నిర్మాణ పనుల సమయంలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా చూడాలన్నారు.

చెడు స్నేహాలకు దూరంగా ఉండండి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పిల్లలు చెడు స్నేహాలు, వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యపై దృష్టి పెట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని ఆమె సందర్శించారు. అక్కడ ఉన్న బాలలతో మాట్లాడారు. క్రమశిక్షణ, సహనం వంటివి వ్యక్తిత్వ అభివృద్ధికి తప్పనిసరి లక్షణాలన్నారు. వాటిని అలవర్చుకుంటే విజయాలు సాధించవచ్చని హితవు పలికారు. వసతి గృహంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కోరుకొండ ఎస్ఐగా నాగార్జున



కోరుకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కేవీ నాగార్జున బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తూ బదిలీపై కోరుకొండ వచ్చారు. ఇప్పటి వరకు కోరుకొండ ఎస్‌ఐగా పని చేసిన కె.నాగరాజు జిల్లా ఎస్పీ ఆఫీస్‌కు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ నాగార్జున ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ వై.సత్యకిషోర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

'బీసీలకు క్షమాపణ చెప్పాలి'

అనపర్తి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బీసీలను చెంచాలుగా అభివర్ణించారని, ఈ మాటలను వెనుకకు తీసుకుని బీసీలకు క్షమాపణ చెప్పాలని టీడీపీ బీసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అనపర్తిలో జరిగిన సమావేశంలో వారు ఈ మేరకు పేర్కొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం

శ్రీ సంత్ సదానంద గిరి మహరాజ్

కోరుకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి ధ్యానాన్ని అలవరుచుకుని, శాకాహారం తీసుకుంటూ తమ ఆత్మశక్తిని, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని శ్రీ సంత్ సదానంద గిరి మహరాజ్ పిలుపునిచ్చారు. శనివారం కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు ఆయన ఆత్మజ్ఞాన ప్రవచనం చేశారు. ధ్యానంతో మనలోని పరమాత్మను గుర్తించవచ్చని, ధ్యానమంటే శ్వాసమీద ధ్యాస ఉంచడమేనన్నారు. ప్రస్తుత వైజ్ఞానిక యుగంలో చాలా మంది అంతులేని రోగాలు, భయం, మానసిక ఒత్తిడి, ఆందోళన, కుటుంబ సభ్యులు, సామాజిక, వ్యక్తిగత సమస్యలతో సతమతమవుతూ జీవితం సాగిస్తున్నారన్నారు.మనలోని అంతర్గత చైతన్యాన్ని మేలుకొలిపి తద్వారా సంపూర్ణ ఆరోగ్యం, ఆనందమైన జీవితం వైపు నడిపించే మార్గమే ధ్యానమన్నారు. ప్రతి రోజు ధ్యాన సాధన చేయడం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, వ్యాధి నిరోధక శక్తి, ఏకాగ్రత పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మణగురాజీ, పిరమిడ్ ధ్యాన శాఖ జిల్లా అధ్యక్షుడు సింగిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, తనకాల బాబు, సూరిశెట్టి సంతోష్, జోనేపల్లి సత్య, అల్లు జయశ్రీ, ఎస్.వెంకటేశ్వరావు, ఉప్పల పాటి వీరాస్వామి, సలాది వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలాల అమావాస్య

దివాన్‌చెరువు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పోలాల అమావాస్య వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. శ్రావణమాసం బహుళ అమావాస్య రోజున ఈపూజ చేయడం ఆనవాయితీ. కంద మొక్కను పసుపు, కుంకుమలతో అలంకరించి దేవుడి గదిలో ఉంచి ఆ మొక్కకు వివిధ రకాల పుష్పాలతో పూజలు చేశారు. బూరెలు, గారెలు వంటిపిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. తమ పిల్లలకు అపమృత్యు భయం తొలగి ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ ఈ వ్రతం ఆచరించామని కొందరు మహిళలు చెప్పారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

బిక్కవోలు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు శనివారం ట్రైనీ ఎస్ఐ వి.రవీంద్ర బాబు ఆధ్వర్యంలో మహిళా పోలీసులు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రైవేటు పార్ట్‌లపై టచ్ చేస్తే వెంటనే పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. వారిపై తాము చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫార్మశీలో ఉపాధి అవకాశాలపై సదస్సు

కోరుకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఫార్మశీ రంగంలో ఉపాధి అవకాశాలపై మండలంలోని నిడిగట్ల గ్రామంలో వికాస్ ఫార్మశీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. సౌత్, ఈస్ట్ ఏషియన్ ఫార్మశీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ తన్నీరు వెంకట నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్ ఎం.చంద్రశేఖరరావు యూనివర్సిటీ ఆఫ్ ఫిన్‌లే (అమెరికా) ముఖ్య అతిథిగా విచ్చేసి యూఎస్ఏలో ఫార్మశీ విద్యకు ఉన్న ప్రాధాన్యాన్ని, ఉద్యోగ అవకాశాల వివరించారు. డాక్టర్ కార్తీక్ రథం(సీఈవో అవినడా ఇన్నోవేషన్, హైదరాబాద్) ఫార్మశీ చదివిన వారు ఔషధ సంస్థలను ఎలా ప్రారంభించాలి, క్లినికల్ కోడింగ్ వంటి విషయాలు తెలియజేశారు. అలాగే డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ చరిష్మా మనస్వి, డాక్టర్ కె.గాయిత్రి, డాక్టర్ కె.సత్యశ్రీ ఫార్మశీ రంగంలో విద్యార్థులకు దేశ విదేశాల్లో ఉద్యోగాలు పొందేందుకు గల నైపుణ్యాలు వివరించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుమలత, సెక్రటరీ డాక్టర్ భరత్ వికాస్, చైర్మన్ తన్నీరు చినసుబ్బారావు, ఎన్.మురళీధర్, పలు ఫార్మశీ కళాశాలల ప్రొఫెసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల అనుమతికి సింగిల్ విండో: కలెక్టర్

కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ అనుమతుల మంజూరు కోసం సింగిల్ విండో సెల్ ఏర్పాటు చేశామని కలెక్టర్, రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగిల్ విండో సెల్‌ను కార్పొరేషన్ కార్యాలయంలో రెండో అంతస్తులోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 21 నుంచి 26 వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, ఏపీఈపీడీసీఎల్, ఫిషరీస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ డిపార్టుమెంటు అధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. రాజమహేంద్రవరంలో ఉత్సవ కమిటీలు ఈ సింగిల్ విండో సెల్‌ను సద్వినియోగం చేసుకుని అనుమతులు పొంది మట్టి వినాయకుడిని పూజించి చవితి ఉత్సవాలు సజావుగా నిర్వహించుకుని నగరపాలక సంస్థకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

బిక్కవోలు/రాజానగరం: ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం వంటి కార్యక్రమాలకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయంలో సింగిల్ విండో సౌకర్యం కల్పించామని బిక్కవోలు ఎంపీడీవో నాగేంద్రప్రసాద్, రాజానగరం తహశీల్దార్ జీఏఎల్ సత్యవతి దేవి తెలిపారు. బిక్కవోలులో తహశీల్దార్ సత్యకృష్ణ, ఎస్ఐ రవిచంద్రకుమార్‌లతో కలిసి మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చవితి మండపాల ఏర్పా టుకు రెవిన్యూ, పోలీస్, ఎంపీడీవోలు కలసి అనుమతులు ఇస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులందరూ నిమజ్జనం రోజున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా మండపాల ఏర్పాటు చేయకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి టి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఆనందనగర్-రత్నంపేటలో టీబీ సర్వే

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆనందనగర్-రత్నంపేట ఏరియాలో ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని చెవిటి, మూగ పిల్లల ఆశ్రమంలో పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ కేవీవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఈ సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి టీబీ వ్యాధి గురించి అవగాహన కల్పించడం జరుగుతున్నదని అన్నారు. టీబీ అనుమానిత లక్షణాలున్నవారు సీబీ నాట్, ట్రూ నాట్ పరీక్షల ద్వారా నిర్ధారించుకుని, మందులు వాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీబీహెచ్‌వీ ఎం.శివ, ప్రియదర్శిని ఆశ్రమం ప్రిన్సిపాల్ బి.ఆశలత, అడ్మిన్ ఆఫీసర్ కె.స్వప్న, ప్రేమలత, ఏఎన్ఎం సీహెచ్ కృపారాణి, ఆశాలు ఎం.శ్రావణి, జి.సరోజ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి పనుల తనిఖీ

రంగంపేట,ఆగస్టు, 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ బృందం 2024-25 సంవత్సరానికి సంబంధించి సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. చంద్రేడులో రూ.25 లక్షలతో 3 పనులు, పెదరాయవరంలో రూ.11 లక్షలతో ఒకటి, మర్రిపూడిలో రూ.26 లక్షలతో 3 పనులు, నల్లమిల్లిలో లక్షలతో ఒక పని, సింగంపల్లిలో రూ.21 లక్షలతో 2 పనులను డీఈఈ ఎండీ అహ్మద్, జేఈ దీప్తి తనిఖీ చేశారు. కార్యక్రమంలో బిక్కవోలు డిఈఈ కె.అచ్యుతరామరెడ్డి, ఎంఈవో కె.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: పరదా
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలస్	: పరదా
స్వామి	: కూలి
అనుశ్రీ(సాయికృష్ణ)	: కూలి
శివజ్యోతి	: బన్ బటగ్ జామ్
రాజా	: వార్-2
ఊర్వశి	: కూలి
మేనక	: యూనివర్శిటీ
రంభ	: స్టాలిన్
కుమారి	: ----
అప్సర	: వార్-2
అశోక	: వార్-2
వీఎస్ మహల్(నామవరం)	: కూలి, వార్-2
మురళీకృష్ణ(ధవళేశ్వరం	: కూలి, వార్-2
వెంకటసూర్య(కడియం)	: కూలి, వార్-2
సత్యగౌరి (అనపర్తి)	: కూలి
సూర్యశ్రీ (అనపర్తి)	: వార్-2
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: వార్-2
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: వార్-2
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కూలి
లలితామహల్(రంపచోడవరం)	: మహావతార్ నరసింహ
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు


భలే మ్యాజిక్ : పెద్దాపురం కుమ్మరివీధిలో నీరు భూమిలో ఇంకిపోయేలా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌లో నీరు పోయించి పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

జనచంద్రం : ప్రజా వేదిక సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



స్వర్ణాంధ్ర చేస్తా!

పెద్దాపురంలో సీఎం చంద్రబాబు

- స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర దిశగా అడుగులు
- బంగారు కుటుంబాలు పెరగాలి
- పారిశ్రామికవేత్తలకు పలు కుటుంబాలు దత్తత

(కాకినాడ,పెద్దాపురం,ఆంధ్రజ్యోతి)

స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర నా లక్ష్యం.. ఆ దిశగానే అడుగులు వేస్తున్నా.. పెద్ద పెద్ద ప్రారంభోత్సవాలు.. కార్యక్రమాల కోసం తాను పెద్దాపురానికి రాలేదని..ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పడానికి వచ్చానని..ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలన్నదే తన సంకల్పం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో శనివారం సీఎం పర్యటించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది.. అప్పుడే ప్రతి కుటుంబం ఆనందంగా ఉంటుందని.. దీనిలో భాగంగానే ఏడు నెలలుగా ప్రతి మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. అపరిశుభ్రత కారణంగా అంటువ్యాధులు వస్తాయని సీఎం వివరించారు. అక్టోబర్ 2వ తేదీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా చెత్త ఉండకూడదని ఆదేశించారు. డ్రోన్లు ఉపయోగించి దోమల నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వ అలక్ష్యంతో అంటువ్యాధులు ప్రబలాయన్నారు. పేదవారు ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రైవేటు ఆసుపత్రులను పీపీపీ పద్ధతిలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. నా లక్ష్యం స్వర్ణ ఆంధ్ర కావాలంటే భవిష్యత్తులో ఏ పార్టీ వైపు చూడకుండా ఎన్డీఏ వైపు ప్రజలంతా ఉండాలని పిలుపునిచ్చారు.


పట్టాభి ఆగ్రో ఇండస్ట్రీస్ ఎండీ బీవీ.కృష్ణారావుకు బంగారు కుటుంబాన్ని దత్తత ఇస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు


మీ సేవలు భేష్ : పారిశుధ్య కార్మికులకు మెమెంటోలు అందజేత

నా పేరు.. పవన్ పేరు చెప్పి బస్సెక్కండి!



టీడీపీ సూపర్‌సిక్స్ అంటే సాధ్యం కాదని చాలామంది అన్నారు.. కానీ ఇప్పుడు అమలు చేసి చూపెట్టాం. ఆగస్టు 15న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం అద్భుతంగా విజయవంతమైంది.. కాకినాడ, రాజమండ్రి వెళ్లాలంటే బస్సెక్కి తన పేరు..పవన్ పేరు చెప్పి జల్సాగా వెళ్లిపోవచ్చని సరదాగా వ్యాఖ్యానించారు. అమ్మగారింటికి వెళ్లాలన్నా, తల్లిని పలకరించేందుకు వెళ్లడానికి ఇక ఇబ్బందే లేదని చమత్కరించారు.

బంగారు కుటుంబాలతో మాటామంతీ..



పాత పెద్దాపురం, సామర్లకోటకు చెందిన నందిక మార్త, యండ మూరి ఏసమ్మ, రాజారపు వీరలక్ష్మి, కడగాల గౌరి, కోసి ఉదయకుమారి, పలివెల లక్ష్మి, మాల్లాడి రాజేశ్వరి, మాటం సత్యవేణి, సరుకుల శ్రీదేవి, ఇజ్జిన స్వాతి కుటుం బాలతో చంద్రబాబు ముచ్చటిం చారు.ఇబ్బందులు తెలుసుకున్నారు. వీరిని దత్తత తీసుకున్న మార్గదర్శులైన లలిత ఇండస్ట్రీస్ ఎండీ మట్టే శ్రీనివాస్,పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ఎండీ బీవీ.కృష్ణారావు, శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్‌సున్న రామకృష్ణ, కొడవడి గాంధీ, అపర్ణ టైల్స్ హెచ్‌ఆర్ అజయ్‌కుమార్, వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ఎండీ వల్లూరి సూర్యప్రకాశరావు,దేవి సీఫుడ్స్ బ్రహ్మానందం, బ్లూ ఓషన్స్ ఎండీ రవికాంత్ తదితరులను సీఎం సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

ఉదయం 11.55 గంటలకు హెలికాప్టర్ దిగిన చంద్రబాబు తొలుత పెద్దాపురం పదో వార్డులో మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించారు.ఆ తర్వాత పావు కిలోమీటరు మేర వైద్యులు, ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛతా ర్యాలీ చేశారు. అనంతరం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో కలిసి బస్సులో 1.20 గంటలకు ప్రజా వేదిక వద్దకు చేరుకున్నారు. పెద్దాపురం మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. వీరి కోసం యాక్సిస్ బ్యాంకు ద్వారా బీమా పథకాన్ని ప్రారంభించారు. పెద్దాపురం మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న వై.వీరవెంకట సత్యనారాయణ, ముత్య దుర్గను సీఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు. అలాగే యాక్సిస్ బ్యాంక్ ద్వారా ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు. సాయంత్రం 5.22 గంటలకు అమరావతికి తిరుగుపయనమయ్యారు.


మీ కుటుంబాలకు నేనున్నా..

గోదారోళ్లు మనసున్నోళ్లు..

అందరి కంటే మంచి మనసున్న వ్యక్తులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్నారు. గోదావరి జిల్లా వాసుల మాట సౌమ్యంగా ఉంటుంది. ఇటువంటి ఈ జిల్లాలోనే గత పాలనలో రౌడీయిజం పెరిగిపోయింది.. హత్యలు చేసే వారిని తూర్పుగోదావరి జిల్లాలోకి రానివ్వరు. కానీ గత వైసీపీ ఎన్నో అరాచకాలు చేసింది. అందుకే గోదావరి జిల్లాల వాళ్లు ఆ పార్టీనే దూరం పెట్టారు. కానీ ఇప్పుడు మేం వీటన్నింటిని సరిచేస్తున్నామన్నారు. పెద్దాపురంలో రూ.330 కోట్లతో చెత్త నుంచి విద్యుదుత్పత్తి తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. రెండేళ్లలో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ 18 నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించానని తెలిపారు. గోదావరి వరదలకు కోనసీమ జిల్లాలో లంక గ్రామాలు ముంపునకు గురైతే ఎప్పటికప్పుడు అందరిని అలర్ట్ చేసి ప్రజలకు అండగా నిలిచామన్నారు. పెద్దాపురంలో రూ.38 కోట్లు, సామర్లకోటలో రూ.39కోట్ల అమృత్ నిధులతో ఇంటింటికి కుళాయి పథకాన్ని మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. రెండేళ్లల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.సామర్లకోటలో డిగ్రీ కళాశాల,పెద్దాపురంలో ప్రభుత్వాసుపత్రి ఇలా పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప ఏది అడిగినా చేస్తాం.అడిగిన దాని కంటే ఎక్కువ చేస్తానన్నారు.



మీ ప్రాజెక్ట్ సూపర్



స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన తొమ్మిది స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రీసైక్లింగ్‌లో భాగంగా చేపడుతున్న ఉత్పత్తులపై ఆరా తీశారు. డ్రైవేస్ట్, ప్లాస్టిక్ వేస్ట్, మెటల్ వేస్ట్‌గా చెత్తను వేరుచేసేలా ప్రాజెక్ట్ రూపొందించిన తొమ్మిదో తరగతి విద్యార్థులను మెచ్చుకున్నారు. సముద్రపు నాచుతో బయోడీజిల్,కాస్మెటిక్స్ వంటి ఉత్పత్తులు తయారు చేస్తున్న నిర్వాహకులతో ముచ్చటించారు. సముద్రపు నాచుతో మహిళలకు ఉపాధి కల్పించే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు సీఎం తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో సముద్రపు నాచుతో ఉత్పత్తులపై శిక్షణ పొందిన మహిళలతో వర్చువల్‌గా మాట్లాడారు.



స్వచ్ఛ రథం.. సూపర్



పెద్దాపురంలో సీఎంతో సెల్ఫీ తీసుకుంటున్న యువతి









సమగ్ర మార్పులే లక్ష్యంగా నూతన బార్ పాలసీ : శర్మ

రాజమహేంద్రవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం నియంత్రణ, వ్యాపారంలో సమగ్ర మార్పులే లక్ష్యంగా ప్రభుత్వం నూతన బార్ పాలసీని అమల్లోకి తెచ్చిందని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు,ఈఎస్‌లు, సీఐలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త బార్ పాలసీ ప్రకారం లైసెన్సుల మంజూరులో ఆన్‌లైన్ విధానం అమలు చేస్తూ, ఎంపికలో పారదర్శకత పాటిస్తున్నామన్నారు.రాష్ట్రంలోని 840 బార్‌లలో గీత కార్మికులకు 10 శాతం కేటాయించామన్నారు. లైసెన్సు ఫీజులను 70 శాతం నుంచి 50 శాతానికి తగ్గించామని వాటిని ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చన్నారు. 26న సాయంత్ర 5గంటల్లోపు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, 28న కలెక్టర్ల సమక్షంలో లాటరీ నిర్వహించి 1 నుంచి కొత్త బార్‌లు అమల్లోకి తీసుకొస్తామని చెప్పారు. మూడు కంటే ఎక్కువ కేసులు ఉన్న సారా వ్యాపారులపై పీడీ చట్టం అమలు చేయాలని సూచించారు.14405 టోల్‌ఫ్రీ నెంబరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.మూడు జిల్లాల్లో 46 బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానించగా కేవలం 8 మంది ఎన్‌రోల్ చేయించుకున్నారు. సమావేశంలో డీసీ చైతన్య మురళీ,ఏసీ రేణుక, ఈఎస్‌లు, ఏఈ ఎస్‌లు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటి వద్దకే స్మార్ట్ రేషన్ కార్డులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకూ గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే పంపిస్తామని జేసీ చిన్నరాముడు తెలిపారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు సంబంధించి 5,59,203 స్మార్ట్ రేషన్ కార్డులను తహశీల్దార్ల కార్యాల యాలకు పంపించామన్నారు. పాత రేషన్ కార్డుల స్థానంలో వీటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సెప్టెంబరు 1 నుంచి రేషన్ షాపుల వద్ద కూడా అందజేస్తామని చెప్పారు. ఈ కార్డులకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

యూరియా వినియోగం ఎందుకు పెరిగింది : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రైతులు అవసరానికి మించి యూరియా వినియోగించకుండా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మండలాల వారీగా యూరియా వినియోగం, సరఫరాపై వ్యవసాయాధికారులతో సమీక్షించారు.గత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 21 వేల మెట్రిక్ టన్నుల యూరియా వినియోగించగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే 26 వేల 464 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ఇండెంట్ సమర్పించారన్నారు.ఈ సీజన్‌లో 1500 ఎకరాల్లో మాత్రమే వరిసాగు పెరిగిన నేపథ్యంలో సుమారు 5 వేల టన్నుల అదనపు యూరియా అవసరం ఎందుకని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటి వరకు 18,588 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రైవేటు ఎరువుల షాపులు, రైతు సేవా కేంద్రాలు, సొసైటీల్లో 2,400 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు.అవసరానికి అనుగుణంగా సరఫరా కొనసాగిస్తామన్నారు. ఆగస్టు 25న జిల్లాకు 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా రానున్నదన్నారు.అవసరమైన మండలాలకు ప్రాధాన్యతతో కూడిన సరఫరా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఐరన్ మాత్రలు పంపిణీ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే 20-49 సంవత్సరాల వయసున్న ఉద్యోగినులు, సిబ్బందికి ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయం ఉద్యోగులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. వారానికోసారి ఐరన్ మాత్రలు వేసుకోవడం ద్వారా రక్తహీనత నివారించవచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులకు ఈ ఐరన్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ పి.కోమల, కొవ్వూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ మౌనిక, ఆఫీస్ సూపరింటెండెంట్ తారా కుమారి, డీపీహెచ్ఎన్‌వో టి.సత్యవతి పాల్గొన్నారు.

వరద బాధితుల ఆహారంలో కోత

రాజమహేంద్రవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వరద పునరావాస కేంద్రాల్లో ఉన్న మత్స్యకారులకు ఆహారంలో కోత పెట్టారు. శుక్రవారం వరకూ విందు భోజనం పెట్టి, శనివారం నుంచి సాంబారు, కూరతో సర్దుకోమన్నారు. అందులోనూ బంగాళా దుంప కూర కావడంతో చాలా మంది పెరుగుతో సరిపెట్టుకున్నారు. వరద బాధితుల పునరావాస కేంద్రంలో భోజనాల కోసం ఒక్కొక్కరికి రూ.350 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆ డబ్బులతో ఉదయం అల్పాహారం,టీ/కాఫీ/పాలు, మధ్యాహ్నం, రాత్రి, భోజనం, సాయంత్రం స్నాక్స్ సమకూర్చాల్సి ఉంది. 3 రోజుల నుంచీ శేషయ్యమెట్టకు చెందిన ప్రైవేటు కేటరింగ్ వాళ్లు వండి తీసుకొచ్చారు. అయితే గురువారం కలెక్టర్ ప్రశాంతి ఆల్‌కట్ గార్డెన్స్ సమీపంలోని నగర పాలక సంస్థ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వెళ్లగా అప్పుడు.. కూరలు ఇబ్బంది అవుతుందని మత్స్యకారులు చెప్పారు. దీంతో పునరావాస కేంద్రం వద్ద వంట చేయాలని ఆమె ఆదేశించారు.ప్రైవేటు కేటరింగ్ వాళ్లకు ఆ విషయం చెప్పగా..కుదరదనడంతో మల్లిఖార్జుననగర్‌కి చెందిన వేరొక కేటరింగ్‌కి అప్పగించారు.దీంతో వాళ్లు శనివారం నుంచి పునరావాస కేంద్రం వద్ద వండుతున్నారు. అయితే.. ఆహారంలో కోత విధించారు. ఉదయం టమాట బాత్, మధ్యాహ్నం,రాత్రికి సాంబారు, కూర, పెరుగుకు పరిమితం చేశారు. ప్రభుత్వం రూ.350 చెల్లిస్తున్నా ఆహారంలో కోతపై విమర్శలు వినవస్తున్నాయి.





గర్భిణులకు మంచాలు ఏర్పాటు

వరద బాధితుల పునరావాస కేంద్రంలోని గర్భిణులకు మంచాలు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి కారణంగా లంకల్లోని మత్స్యకారులను పునరావాస కేంద్రాల్లోకి తరలించారు. వీళ్లలో గర్భిణులు ఉన్నారు. మంచాలు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది.దీంతో అర్బన్ తహశీల్దార్ పాపారావు స్పందించి పునరావాస కేంద్రంలో మంచాలు ఏర్పాటు చేయించారు. దీంతో గర్భవతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఇంట్లో ఉంచొద్దు

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు పార్కు వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డ్రోన్ సహాయంతో కంబాలచెరువులో దోమల మందు పిచికారీ చేశారు. కంబాలచెరువులో దోమల నివారణకు గంబూషియా చేప పిల్లలు వదిలారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలో పాడైన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇంట్లో ఉంచుకోవడం లేదా విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సేకరణ కేంద్రంలో ఈ వ్యర్థాలను అందజేస్తే వాటిని సరైన రీతిలో రీసైక్లింగ్ చేసి ముప్పులేకుండా తొలగించడం జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించే ప్రతి ఒక్కరూ రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అనే మూడు విషయాలను గుర్తుంచుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని నగరంలో సమర్థవంతంగా అమలుచేసి పర్యావరణాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఒక బృహత్తరమైన కార్యక్రమం అన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, మేనేజరు ఎండి అబ్దుల్ మాలిక్, ఈఈలు మాధవి, రీటా మదర్సాఆలీ తదితరులు పాల్గొన్నారు.




కంబాలచెరువులో డ్రోన్‌తో దోమల మందు పిచికారీ.. గంబూషియా చేప పిల్లలు విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము

కేపీఐను నమోదు చేయాలి

రాజమహేంద్రవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర- 2047 విజన్ లక్ష్యాలకు అనుగుణంగా నిర్దేశించిన ప్రాధాన్య పని తీరు సూచికలను(కేపీఐ) ఎప్పటికప్పుడు సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ప్రశాంతి శనివారం ఆదేశించారు. జిల్లా, మండల స్థాయిలో నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక, వార్షిక పని తీరు సూచికల లక్ష్యాలను, ఇప్పటి వరకూ సాధించిన ప్రగతిని ఈ నెల 25లోపు స్వర్ణాంధ్ర వెబ్ సైటులో పొందుపర్చాలన్నారు. ఇకపై నెలవారీ కేపీఐని ప్రతి నెలా 5వ తేదీ లోపు పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. డేటా నమోదులో తప్పులు ఉంటే సరిచేయాలని సూచించారు. శాఖల వారీగా నిర్దేశించిన నెలవారీ లక్ష్యాలను జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయానికి జిల్లా అధికారులు సమర్పించాలని చెప్పారు.కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు,డీఆర్వో సీతారామమూర్తి, సీపీవో/జేడీ అప్పలకొండ, డ్వామా పీడీ నాగ మహేశ్వరరావు,డీఎంహెచ్‌వో వెంకటేశ్వర రావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కేసులు రాజీ చేసుకోవాలి : జడ్జి

కొవ్వూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి. సాయికృష్ణ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.నాగమణి, ఆర్డీవో రాణీసుస్మిత, తహశీల్దార్ పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లిలా..?



కంసాలిపాలెం - మాధవరం మధ్య కూలిపోయిన బ్రిడ్జి

● కంసాలిపాలెం - మాధవరం మధ్యలో కూలిపోయిన బ్రిడ్జి కల్వర్టు
● ఉభయ గోదావరి జిల్లాల ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

నిడదవోలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలను కలుపుతూ ఉన్న బ్రిడ్జి వరదలకు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా... పాలకులు నేటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలిచినా ... ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రాలేదు. దీంతో గోదావరి జిల్లాల వాసులు ఇంకెన్నాళ్లిలా అని ఆవేదన చెందుతున్నారు. వివరాలివి... తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం కంసాలి పాలెం శివారు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య ఉన్న బ్రిడ్జి సుమారు ఆరేళ్ల క్రితం ఎర్రకాలువ వరదలకు కొంత భాగం కొట్టుకుపోయింది. ఆ తరువాత మరికొంత కూలిపోయింది. కాగా, ఈ బ్రిడ్జిపై నుంచే వ్యవసాయదారులు, ఉద్యోగులు, విద్యార్థులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి కారణం నిడదవోలు నుంచి తాడేపల్లిగూడెం వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో పాటు మరోపక్క ట్రాఫిక్ కూడా ఉండదు. ఈ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను గుర్తించిన కొందరు రైతులు స్వచ్ఛందంగా పక్కనే బాటా మార్గాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఎర్రకాలువ బాట మార్గం మునిగిపోతుండడంతో గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. అప్పటి ప్రభుత్వంలో దీనికి తూరలు ఏర్పాటు చేసి కల్వర్టుగా మార్చారు. తర్వాత బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలిచినా.. ప్రభుత్వం నుంచి సొమ్ములు రావనే ఉద్దేశంతో ఒక్క రంటే ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రాలేదు. దీంతో బ్రిడ్జి పునఃనిర్మాణానికి నోచుకోలేదు. ఆనాటి నుంచి నేటి వరకు అలాగే ఉంది. ప్రస్తుతం నిడదవోలు పట్టణంలో ఆర్వోబీ పనులు జరుగుతుండడంతో నిడదవోలు తాడేపల్లిగూడెం రైల్వేగేటు మార్గంలో వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ ఎక్కువ మంది వాహనదారులు కంసాలిపాలెం కల్వర్టుపై నుంచే ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జారిపడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా రెండు జిల్లాల పాలకులు దృష్టిసారించి బ్రిడ్జి పునఃనిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గోతులమయంగా మారిన కల్వర్టు రోడ్డు

కైవల్యారెడ్డికి మంత్రి దుర్గేష్ అభినందనలు



విద్యార్థిని కైవల్యారెడ్డిని అభినందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని, ప్రతిఒక్కరూ విద్యార్థి కైవల్యారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని కైవల్యా రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసా ఇంటర్‌నేషనల్ ఎయిర్ స్పేస్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేయడం ఎంతో గొప్పవిషయన్నారు. ఈ సందర్భంగా ఆమె సాధించిన పలు రికార్డులను ఆయన చూసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కైవల్యారెడ్డి తల్లితండ్రులు శ్రీనివాసరెడ్డి, విజయా శ్రీనివాస రెడ్డి, ఉప్పులూరి రామ్మోహన్, ఇమ్ము, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీసుస్మిత, పక్కన డీఎస్పీ

కొవ్వూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో వినాయక నవరాత్రులను విజయవంతం చేయాలని ఆర్డీవో రాణీసుస్మిత అన్నారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి అధికారులతో వినాయకచవితి ఉత్సవాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ మండపాలు ఏర్పాటుచేసే కమిటీ సభ్యులు ముందస్తుగా అనుమతి పొందాలన్నారు. దీనికోసం ఎంపీడీవో కార్యాలయంలో సింగిల్‌విండో విధానాన్ని అమలుచేస్తున్నామన్నారు. గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 24 గంటల్లో అనుమతులు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అలాగే పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ రూపొందించడం జరిగిందన్నారు. అలాగే నిమజ్జనాల ప్రదేశాలలో మాత్రమే విగ్రహాల అనుప నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, ఇరిగేషన్, ఫైర్, మత్స్యశాఖ, ఎలక్ట్రికల్, హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్ పరామర్శ



రామకృష్ణను పరామర్శిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పరామర్శించారు. రామకృష్ణ సోదరుడు రామారావు ఇటీవల మృతి చెందడంతో శనివారం మంత్రి ఉండ్రాజవరంలో రామకృష్ణ నివాసానికి విచ్చేసారు. ఈ సందర్భంగా రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమళ్ల శ్రీనివాస్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, మండల ప్రత్యేక అధికారి ఎం. సందీప్, తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రామారావు, పీహెచ్‌సీ డాక్టర్ దుర్గామహేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు

● మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి



శ్రీరామకాలనీలో పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. శనివారం ఒకటో వార్డు శ్రీరామకాలనీలో పారిశుధ్య సిబ్బందితో గ్యాంగ్ వర్కు చేయించారు. పనులను చైర్‌పర్సన్ పరిశీలించి మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శానిటేషన్ చేపట్టామన్నారు. సెలవు రోజులు మినహా మిగతా అన్నిరోజులూ గ్యాంగ్ వర్కు చేపట్టి పట్టణంలోని 23 వార్డుల్లో పారిశుధ్య పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇంచార్జి రవి, పారిశుధ్య మేస్త్రీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే పురపాలక సంఘాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జీ.సందీప్ అన్నారు. పట్టణంలోని 23వ వార్డులో శనివారం సర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 23వ వార్డు మైపాల వారి వీధిలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలన, ప్లాస్టిక్ వ్యర్థాల నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలంతా జాగ్రతలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం అన్నదేవరపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతాయన్నారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణాన్ని పరిశీలిస్తూ ఆవరణలో ఎదిగిన పిచ్చిమొక్కలను ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది ద్వారా తొలగించాలని, అలాగే పాడుబడిన పాత భవనాన్ని తొలగించి కొత్త భవనానికి ప్రతిపాదనలు పంపాలని ఇంజనీరింగ్ అధికారులకు చరవాణిలో ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉత్తమ సేవా అవార్డులను పొందిన డాక్టర్ స్వర్ణలత, ఎస్ఐ రామకృష్ణను నాయకులు, అధికారుల సమక్షంలో దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షుడు గోరిజాల వెంకట ప్రసాద్ (జీవీ), ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, ఇందుగుల రామకృష్ణ, వెలుగు బంటి బాలకృష్ణ, చెవ్వూరి బంగారాజు, కవల రామాంజనేయులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి ముఖ్యమని తహశీల్దార్ నిరంజన్ అన్నారు. శనివారం కానూరులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భావన మధు పూర్ణచంద్, మెడికల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, బూరుగుపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని దేవరపల్లి సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు పేర్కొన్నారు. స్థానిక సొసైటీ వద్ద శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేసిన అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్‌పర్సన్ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామాల్లోని వీధులు కూడా శుభ్రం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో కల్లూరి శ్రీనివాస్ శర్మ, టీడీపీ నాయకులు కాట్రు భీమరాజు, కొండపల్లి దొరయ్య, పిన్నమని నవీన్, యలమాటి ఆక్కిరాజు పంచాయతీ కార్యదర్శి ఎన్‌రవికిశోర్, సొసైటీ సిబ్బంది గుడ్ల వెంకటేశ్వరరావు, పసుపులేటి రాధాకృష్ణ, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: గ్రామాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాలంగిలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంపీడీవో వీఎస్ రామారావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు తడి, పొడిచెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. గ్రామసర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ, ఏఈలు ఏడుకొండలు, భవాని, హౌసింగ్ ఏఈ కొండలరావు, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ హసన్‌జాని, జనసేన గ్రామఅధ్యక్షుడు వి.ఫణికుమార్, టీపీ కాంతారావు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు త్వరితగతిన అందించండి



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ నాయుడు

నల్లజర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులు ఈనెల 25వ తేదీ నుంచి లబ్ధిదారులకు త్వరితగతిన అందించాలని తహశీల్దార్ నాయుడు పేర్కొన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి నూతన రేషన్ కార్డులకు సంబంధించి తగు సూచనలు తెలియజేశారు. సచివాలయ సిబ్బంది, వీఆర్వోల సమక్షంలో రేషన్ డీలర్లు ఈనెల 31 వరకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి వేలిముద్రలు వేయించుకుని కార్డులు అందించాలన్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి రేషన్ డిపో వద్ద రేషన్ సరుకులతోపాటు కార్డులు సైతం అందించాలన్నారు. ఆ నెల 15వ తేదీ లోపు మిగిలిన కార్డులను తహశీల్దార్ కార్యాలయానికి అప్పగించాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఐవీఎస్‌ఆర్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతినెలా 10 వ తేదీ నుంచి ఐవీఆర్‌ఎస్ కాల్ వస్తాయని, అప్పటికీ సరుకులు తీసుకోనివారు ఉంటే ఇబ్బందులు పడతారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, డీలర్ల సంఘం అధ్యక్షుడు చీమకుర్తి నరసింహ మూర్తి, ఉపాధ్యక్షుడు దూళిపాల వెంకన్న, కోశాధికారి ఈబిచర్ల కృష్ణ, కార్యదర్శి ప్రతిపాటి లతా మంగేష్కర్, ఉప కారదర్శి బాసిశెట్టి లక్ష్మణరావు, ప్రచారకర్తలు తానిగడప మహేశ్, చీమకుర్తి నాగు, అచ్యుత భాస్కరరావు, చెల్లు మోజేష్, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ సోమవారం నుంచి ప్రారంభించనున్నట్టు తహశీల్దార్ ఎం. మెరికమ్మ తెలిపారు. దీనిపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఈ కార్డులు అందరికీ ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయర్స్ డిప్యూటీ తహశీల్దార్ ఎం. సునీత, తదితరులు పాల్గొన్నారు.

పీవీఎన్ మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలి



కొవ్వూరుపాడులో మాట్లాడుతున్న పడాల నాగరాజు

గోపాలపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 1న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా బీజేపీ శ్రేణు లంతా ఘన స్వాగతం పలికేందుకు వేలాదిగా తరలి రావాలని మాజీ పార్లమెంట్ కన్వీనర్ పడాల నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం కొవ్వూరుపాడులో పెనుమత్స రంగరాజు నివాసం వద్ద బూత్ ఇన్‌చార్జీల సారథ్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ, జిల్లా స్థాయి నుంచి ఉన్న బూత్ ఇన్‌చార్జీలు, అనుబంధ సంఘాల నాయకులు అధికసంఖ్యలో హాజరు కావాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గెల్లా శ్రీనుబాబు, సీనియర్ నేతలు మార్కెండేయ చౌదరి, మద్దాల నరసింహమూర్తి, అనిశెట్టి శ్రీనివాసరావు, అప్పారావు, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా సొమ్ము అందజేత



డీడీను అందిస్తున్న శేషారావు

పెరవలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం కలిగి ఉండి ప్రమాదవశాత్తు ఒకవేళ ఆ వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. కాకరపర్రుకి చెందిన టీడీపీ కార్యకర్త సిల్లే గోవిందరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో అతనికి టీడీపీ సభ్యత్వం ఉండటంతో రూ.ఐదు లక్షల ప్రమాద బీమా సొమ్ము మంజూరయ్యింది. ఆ బీమా సొమ్ము డీడీను శేషారావు బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెన్మత్స మధు, తమ్మిన సీతారామయ్య పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డీఎస్పీ



రాజీవ్‌కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి మండపాలు నిర్వహించే కమిటీలు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కొవ్వూరు డీఎస్పీ జీ.దేవకుమార్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని రాజీవ్‌కాలనీలోని గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయం వద్ద వినాయకచవితి మండపాల నిర్వహణపై కాలనీ వాసులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ గత సంవత్సరం లాగా నిమజ్జనం ఊరేగింపు సమయంలో జరిగిన అల్లర్లు, సంఘటనలు పునరావృతం కాకుండా ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత అర్జిల్లి రామకృష్ణ, పట్టణ సీఐ పీ. విశ్వం, ఏఎస్ఐ జీ.శ్రీనివాస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

దేవరపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ నాగేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. దేవరపల్లి బీహెచ్ఎస్ఆర్ అండ్ వీఎల్ఎం డిగ్రీ కాలేజీ విద్యార్థులకు సైబర్ నేరాలపై శక్తిటీమ్ పోలీసులతో అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మన వ్యక్తిగత సమాచారాన్ని ఫేస్‌బుక్, వాట్సప్‌ల్లో పెట్టరాదన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ అభివృద్ధికి రూ. రెండు లక్షల విరాళం




దేవరపల్లిలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న దాత రామకృష్ణ

దేవరపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర స్వామి ఆలయాభివృద్ధి కోసం ఆలయ చైర్మన్ అంబటి శ్రీనివాసరావుకు దేవరపల్లికి చెందిన దాత పిన్నమని రామకృష్ణ శనివారం రూ. రెండు లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు పిన్నమని రామకృష్ణ, ఆయన కుమారుడు పిన్నమని ప్రసాద్‌కు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుడ్ల వెంకటేశ్వరరావు, గేలం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య దశ నుంచే యోగా సాధన అవసరం

● జడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజు, వ్యాపారవేత్త రాజీవ్‌కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న బాపిరాజు

నల్లజర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బాల్య దశ నుంచే విద్యార్థులు యోగా సాధన చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపి రాజు, ప్రముఖ వ్యాపార వేత్త రాజీవ్ కృష్ణ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో శనివారం నల్లజర్లలోని కింగ్స్ వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్లో యోగా పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బాపిరాజు, రాజీవ్ మాట్లాడుతూ ఎక్కడో టీవీ కార్యక్రమాల్లో చేసే విన్యాసాలు మన కళ్ల ఎదుట, మన ప్రాంత చిన్నారులే చేస్తుంటే గర్వంగా ఉందన్నారు. మన ప్రాంత వాసి అయిన భీమవరానికి చెందిన శిరీష ఇటీవల సింగపూర్‌లో టీమ్ ఇండియా కెప్టెన్‌గా వ్యవహరించి రెండు బంగారు పతకాలు, ఐదు కాంస్య పతకాలు తీసుకురావడం ఆనందదాయ కమన్నారు. చిన్నారులు అర్మిత భవాని చౌదరి, శిరీష వేసిన యోగా విన్యాసాలు పలువురిని అలరించాయి. 250 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగా సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు సీహెచ్‌ఏఆర్కే వర్మ, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి యోగాభూషణ్ అవార్డ్ గ్రహీత అవినాష్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సుబ్బారావు, దుర్గాప్రసాద్, కింగ్స్ వుడ్ చైర్మన్ దాపర్తి శివ, డైరెక్టర్ నిఖిల, చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకట రమణ, బేతిన దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'టంగుటూరి' జయంతి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విజేత పాఠశాల విద్యార్థులు

తాళ్లపూడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పైడిమెట్ట మండల పరిషత్ బేసిక్ పాఠశాలలో టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాఠశాల హెచ్ం ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శ్రీవిజేత పాఠశాలలోనూ టంగుటూరి జయంతిని నిర్వహించారు. దీనికి ప్రిన్స్‌పాల్ ప్రమోద్ కుమార్ హాజరై మాట్లాడుతూ తెల్లవాడి తుపాకీకి గుండెలు చూపి దమ్ముంటే కాల్చండిరా అంటూ గర్జించిన మహోన్నత వ్యక్తి అని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణ, ఆలీ, విజయ్, కరిష్మా, గంగారత్నం, సలోమి, చంద్రిక, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వీఎస్ రామారావు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఈవోపీఆర్డీ కే. ఆంజనేయశర్మ, ఏఈలు ఏడుకొండలు, భవాని, హౌసింగ్ ఏఈ కొండలరావు, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ హసన్‌జానీ, టీపీ కాంతారావు, జనసేన గ్రామఅధ్యక్షుడు వి. ఫణికుమార్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: మండల తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి తహశీల్దార్ ఎం. మెరికమ్మ పూలమాల వేసి నివాళి అర్పించారు. దీనిలో భాగంగా ఆమె మాట్లాడుతూ నేటి యువతకు ఆయన జీవితం ఆదర్శంగా నిలిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్కే కమాల్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

● ఏడుగురి అరెస్టు ● రూ. 50,170 నగదు స్వాధీనం

గోపాలపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ మనోహర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి... జిల్లా ఎస్పీ కే.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, దేవరపల్లి సీఐ బీఎన్ నాయక్ పర్యవేక్షణలో వాదాలకుంటలో రహస్యప్రదేశంలో జరుగుతున్న పేకాట శిబిరంపై తన సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేసినట్టు తెలిపారు. ఇందులో ఏడుగుర్ని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 50,170 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అదుపులోకి తీసుకున్న వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని రామన్నపాలెం సర్పంచ్ మృతి





సర్పంచ్ బుల్లారావు (ఫైల్), ప్రమాదానికి కారణమైన లారీ

దేవరపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌ను టిప్పర్ లారీ వేగంగా ఢీకొనడంతో ఓ గ్రామ సర్పంచ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... రామన్నపాలెం గ్రామ సర్పంచ్ కూచిపూడి బుల్లారావు (71) శనివారం దేవరపల్లి పెట్రోల్ బంక్‌కు వెళ్లడానికి వస్తుండగా తాడేపల్లిగూడెం మండలం పెదతా డేపల్లికి చెందిన టిప్పర్ లారీ దుద్దుకూరు మెటల్ కోసం వెళ్తోంది. ఈ క్రమంలో దేవరపల్లి పెట్రోల్‌బంకు వద్ద ఎదురుగా వెళ్తున్న మోటార్ సైకిల్‌ను టిప్పర్ లారీ వేగంగా ఢీకొని సుమారు 20గజాల దూరం ఈడ్చుకుని వెళ్లిపోయింది. దీంతో బుల్లారావు ముఖభాగమంతా నుజ్జునుజ్జుఅయ్యింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ విజయ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుల్లారావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కూచిపూడి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శవపంచనామా అనంతరం స్వ గ్రామం రామన్నపాలెం తరలించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బుల్లారావు పార్థివదేహానికి మాజీమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, ఎంపీపీ కేవీకే దుర్గారావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయితే లారీకి ముందు భాగంలో సగభాగం అద్దానికి స్టిక్కర్లు, బొమ్మలతో అలంకరించడంతో ఎవరు వెళ్తున్నది సరిగా కనిపించకుండా ఉండే విధంగా ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.